PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 209 | విజయవాడ, గురువారం 2 మార్చి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 2 March 2023 | Rs

నేడు కౌంటింగ్

న్యూఢిల్లీ : ఇటీవల జరిగిన మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. గత ఫిబ్రవరి 16న త్రిపుర, 27న మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్‌లో మూడు అసెంబ్లీ స్థానాల ఫలితం కూడా గురువారమే తేలనుంది.



గ్యాస్‌బండపై మరో రూ.50 పెంపు

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

వంటగ్యాస్ మరోసారి భగ్గుమంది. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియగానే వంటగ్యాస్ సిలిండర్ ధర మరో 50 రూపాయలు పెంచింది. ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలకు ఇది మరింత ఆజ్యం పోస్తుంది. ఇప్పటికే ఆందోళన కలిగిస్తున్న ద్రవ్యోల్బణానికి మరింతగా రెక్కలొస్తాయి. వాణిజ్య అవసరాలకు ఉపయోగించే సిలిండర్‌పై రూ.350.50 మేర భారం మోపింది. పెరిగిన రేట్లు బుధవారం నుండే అమల్లోకి వస్తాయని ప్రభుత్వ యాజమాన్యంలోని పెట్రోలియం సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) ప్రకటించాయి.

మంగళవారం వరకూ హైదరాబాద్‌లో గృహ వినియోగానికి వాడే 14.2 కిలోల ఎల్‌పిజి సిలిండర్ ధర రూ.1,105 ఉండగా, పెరిగిన ధరతో రూ.1,155కు చేరుకుంది. 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,769 నుంచి రూ.2,119.50కి పెరిగింది. ఢిల్లీలో 14.2 కిలోల ఎల్‌పిజి సిలిండర్ ధర రూ.1,103 నుంచి రూ.1,153కి, కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,769 నుంచి రూ.2,119.50కి పెరిగింది. ముంబయిలో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.1,102.50 నుంచి రూ.1,152.50కి, కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,721 నుంచి రూ.2,071.50కి పెరిగింది.

విమాన ఇంధన ధర తగ్గింపు

మరోవైపు విమాన ఇంధనం ధరలు నాలుగు శాతం తగ్గాయి. ఢిల్లీలో జెట్ ఇంధన ధరలు కిలోలీటర్‌కు రూ. 4,606.50 తగ్గింది.

దేశవ్యాప్తంగా ఆందోళనలు

పెరిగిన గ్యాస్ ధరలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ బీసెంట్ రోడ్డు అన్సారీ పార్కు వద్ద సిపిఎం ఆధ్వర్యాన బుధవారం ధర్నా జరిగింది. ధర్నానుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధర తగ్గించేవరకు సిపిఎం పోరాడుతుందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన సమయంలో నాలుగు వందల రూపాయలు ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1200ఎ పెరిగిందని తెలిపారు. అన్ని రకాల ధరల పెంచుతున్న, పన్నుల భారం మోపుతున్న బిజెపి ప్రభుత్వానికి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు.

వెంటనే ఉపసంహరించాలి : సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : గృహావసరాల కోసం వినియోగించే వంట గ్యాస్ సిలిండర్ ధర బుధవారం నుంచి రూ.50 పెంచడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో బుధవారం నాడిక్కడ ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. నిరంతరం పెరుగుతున్న ఆహార, నిత్యావసరాల ధరలతో వేగలేకపోతున్న జనంపై మరో పెద్ద బండ మోపడమేనని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ భారాన్ని భరించలేక సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాడడం మానివేస్తారు.

ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ కనెక్షన్ పొందినవారిలో పది శాతానికి పైగా గత ఏడాది కాలంలో ఒక్క రీఫిల్ సిలిండర్‌ను కూడా తీసుకోలేదు. సంవత్సరానికి పన్నెండు సిలిండర్లు తీసుకోవాల్సి ఉండగా వీరు ఒక్క సిలిండర్ కూడా తీసుకోలేదు. 12శాతం మంది కేవలం ఒక్క రీఫిల్ సిలిండర్ మాత్రమే తీసుకున్నారు.. ఏడాదికి 12 సిలిండర్లకు అర్హులైనా, సగటున కనీసం 7 ప్లస్ సిలిండర్ల అవసరం వుండగా, 56.5 శాతం మంది కేవలం నాలుగు లేదా అంతకన్నా తక్కువ రీఫిల్స్ తీసుకున్నారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ధరలను ఈ ఏడాదిలో రెండుసారు పెంచేసింది. తాజాగా రూ.350.50 పెంచడంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ.2119.5 అయింది.

ఇంతకు ముందు అది రూ.1769గా వుండేది. దీంతో అన్ని ప్రాసెస్డ్ ఆహారోత్పత్తుల తయారీ ఖర్చులు మరింతగా పెరిగిపోతాయి. దేశంలో నిరుద్యోగం, దారిద్ర్యం, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈ క్రూరమైన పెంపు చోటు చేసుకుంది. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

మరో 6 కొత్త మండలాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా ఆరు మండలాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. విజయనగరం, చిత్తూరు, నంద్యాల, అనంతపురం, మచిలీపట్నం, ఒంగోలును అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా కేంద్రం ఉన్న మండలాలను అర్బన్, రూరల్ మండలాలుగా విభజించింది. మండలాల విభజనకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్‌లో ఏమైనా అభ్యంతరాలుంటే 30 రోజుల్లోగా స్థానిక కలెక్టరుకు తెలియజేయాలని ప్రభుత్వం పేర్కొంది.

ధాన్యం కొనుగోళ్లు నిలిపివేత

- లక్ష్యం పూర్తయిందని చెప్తున్న అధికార్లు
- పలు జిల్లాల్లో రైతుల వద్దే లక్షల టన్నులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ధాన్యం అమ్ముదామని రైతు భరోసా కేంద్రాలకు (ఆర్‌బికెలకు) వెళ్తున్న రైతులకే నిరాశే ఎదురవుతోంది. లక్ష్యం పూర్తయిందని, పైనుంచి ఆదేశాల వచ్చే వరకు ఏమీ చేయలేమని అధికారులు చెప్తుండడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సాధారణంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మార్చి 31 వరకు సాగుతుంది. ఆ కాలంలో శ్రీకాకుళం, ఉమ్మడి గుంటూరు వంటి జిల్లాల్లో మినుము, పెసర పంటలు వేస్తుంటారు. ఖరీఫ్‌లో పండించిన వరిని వెంటనే నూర్చకుండా పొలాల్లోనే కుప్పలుగా ఉంచారు. ప్రస్తుతం అపరాల కోతలు పూర్తి కావడంతో రైతులు ధాన్యం నూర్పులు చేస్తున్నారు. ఈ సమయంలోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ముగించడంతో పలు జిల్లాల్లో లక్షలాది మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దే ఉండిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో రూ.37 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఇంతవరకూ సుమారు 33 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. అంచనాకు మించి కొన్ని జిల్లాల్లో దిగుబడులు వచ్చాయి. ఫిబ్రవరి 15వ తేదీతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ముగిస్తామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా ప్రకటించారు. అప్పటికే మిగతా 5లో



శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం మూలపేటలో ధాన్యం బస్తాలను సిద్ధం చేస్తున్న రైతులు

జిల్లా	లక్ష్యం (మెట్రిక్ టన్నులు)	కొనుగోలు (మెట్రిక్ టన్నులు)
శ్రీకాకుళం	7 లక్షలు	5.05 లక్షలు
పార్వతీపురం మన్యం	3.24 లక్షలు	2.32 లక్షలు
విజయనగరం	3.30 లక్షలు	2.64 లక్షలు
గుంటూరు	37 వేలు	13,600
పల్నాడు	61 వేలు	2,500
బాపట్ల	1.20 లక్షలు	61 వేలు

వైఎస్ భాస్కర్‌రెడ్డికి సిబిఐ నోటీసులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డికి బుధవారం సిబిఐ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 12న కడప సెంట్రల్ జైలు గెస్టుహౌస్ వద్దకు విచారణకు హాజరు కావాలని సిబిఐ అధికారులు ఈ నోటీసులో పేర్కొన్నారు. ఆయనకు నోటీసులు ఇవ్వడం ఇది రెండోసారి. గత నెల మూడో వారంలో తొలిసారిగా నోటీసులు జారీ చేశారు. అయితే, ఆయన విచారణకు హాజరు కాలేదు. తనకు సమయం కావాలని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సిబిఐ తాజాగా మళ్లీ నోటీసులు జారీ చేసింది. కాగా, ఈ ఏడాది జనవరి 28న అవినాష్‌రెడ్డిని సిబిఐ తొలిసారి విచారించింది. పలు వివరాలు సేకరించింది. ఫిబ్రవరి 23న మరోసారి విచారించింది. నిందితుల జాబితాలోని వారిని విచారించడం వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో భాస్కర్‌రెడ్డికి మరోసారి నోటీసులు ఇచ్చింది.

ప్రేమోన్మాది ఘాతుకం

- బెంగళూరులో కాకినాడ యువతి దారుణహత్య

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి



లీలాపవిత్ర

బెంగళూరులో కాకినాడకు చెందిన యువతి దారుణహత్యకు గురైంది. పెళ్లికి నిరాకరించిందనే కారణంతో ఆమె ప్రియుడే కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన నలమాటి అబ్బులు, రాధాకృష్ణవేణి దంపతులకు లీలాపవిత్ర (28) ఒక్కగాని ఒక్క కూతురు. అబ్బులు ఫైనాన్స్ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఒక్కర్తే కుమార్తె కావడంతో చిన్ననాటి నుంచి ఆమెను గారాబంగా పెంచుకున్నారు. ఆమె చదువు నిమిత్తం కాకినాడలోగల జగన్నాథపురంలోని విష్ణాలయం వీధిలో ఓ ఇంట్లో ఎనిమిదేళ్ల నుంచి అద్దెకు ఉంటున్నారు. కుమార్తెను ఎంఎస్‌సి వరకూ చదివించారు. బెంగళూరులోని మురుగేష్ పాల్యలోని ఒమేగా హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం రావడంతో ఆమెను బెంగళూరుకు పంపారు. ఐదున్నరేళ్లుగా పవిత్ర అక్కడే ఉంటోంది. అదే కంపెనీలో పనిచేస్తున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన దివాకర్ అనే యువకునితో ఆమెకు పరిచయమైంది. ఇదికాస్తా ప్రేమగా మారింది. ఐదేళ్ల పాటు వారు ప్రేమించుకున్నారు. ఈ విషయాన్ని పవిత్ర ఇటీవల తన తల్లిదండ్రులకు తెలిపింది. వారు పెళ్లికి నిరాకరించారు. అప్పటి నుంచి దివాకర్‌ను పవిత్ర దూరం పెడుతూ వచ్చింది. ఇటీవల వేరే యువకునితో ఆమెకు పెళ్లిని నిశ్చయమైంది. దీంతో, తనను పెళ్లి చేసుకోవాలని పవిత్రపై దివాకర్ ఒత్తిడి తెచ్చాడు. ఇందుకు ఆమె తిరస్కరించడంతో కక్ష పెంచుకున్నాడు. మంగళవారం సాయంత్రం ఎప్పటిలానే విధులు ముగించుకుని కార్యాలయం నుంచి వస్తున్న పవిత్రను తనతో తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా పొడిచాడు. సహచర ఉద్యోగులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు దివాకర్‌ను అరెస్టు చేశారు. తీవ్రంగా గాయపడిన పవిత్రను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కాకినాడలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన వారు బెంగళూరుకు పయనమయ్యారు. ఈ ఘటనతో కాకినాడలోని విష్ణాలయం వీధిలో విషాదం నెలకొంది. పవిత్ర అందరితోనూ కలుపుగోలుగా ఉండేదని, నవ్వుతూ మాట్లాడేదని స్థానికులు తెలిపారు. గురువారం కపిలేశ్వరపురంలో అంత్యక్రియలు నిర్వహించే వీలుంది.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అరెస్ట్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



టిడ్కో ఇళ్లను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం విజయవాడలో జరిగే మహాధర్నాలో పాల్గొనకూడదంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను బుధవారం నంద్యాలలో అరెస్టు చేశారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సమావేశాన్ని నగరంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సమావేశం అనంతరం బయటకు వస్తున్న ఆయనను పోలీసులు అరెస్టు చేసేందుకు యత్నించారు. అడ్డుపడిన నాయకులను, రామకృష్ణను నంద్యాల రెండవ పట్టణ స్టేషన్‌కు తరలించారు. ఆయన అరెస్టును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, నంద్యాల జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ ఖండించారు. టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాల సమస్యపై ప్రజల తరపున పోరాడుతుంటే అరెస్టు చేయడం సిగ్గుచేటని వారు పేర్కొన్నారు. రామకృష్ణను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

శీఘ్రగతిన ఆర్థిక నేరగాళ్ల అప్పగింత

- జి 20 దేశాలను కోరిన భారత్

న్యూఢిల్లీ : ఆర్థిక నేరాలకు పాల్పడి దేశం విడిచి పారిపోయిన నేరస్తులను తిరిగి స్వదేశానికి శీఘ్రగతిన అప్పగించేందుకు బహుముఖ చర్యలు తీసుకోవాలని జి 20 దేశాలను భారత్ కోరింది. ఆర్థిక నేరస్తులను అప్పగించడమే కాదు, వారి నుండి దేశ విదేశాల్లో ఆస్తుల రికవరీ కూడా జరిగేలా చూడాల్సి వుందని కోరింది. దేశ రాజధాని శివార్లలోని గుర్‌గావ్‌లో అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూపు మొదటి సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ఇటలీ ప్రతినిధితో కలిసి కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అధ్యక్షత వహించారు. ఆర్థిక నేరాలనే సమస్యను ఈనాడు చాలా దేశాలు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ముఖ్యంగా ఆర్థిక నేరస్తులు దేశ న్యాయ పరిధిని దాటి పారిపోవడమే అతిపెద్ద సవాలుగా మారుతోందన్నారు. ఇందుకు సంబంధించి భారతదేశం ప్రత్యేక చట్టం ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ యాక్ట్, 2018ని తీసుకువచ్చిందని సింగ్ చెప్పారు. ఇలా ఆర్థిక నేరాలకు పాల్పడి దేశం విడిచి పారిపోయిన వారివల్ల ప్రభుత్వ రంగ బ్యాంకులకు 27,200కోట్ల డాలర్ల మేరకు నష్టం వాటిల్లింది. అలా నష్టపోయిన బ్యాంకులకు 18వేల కోట్ల డాలర్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బదిలీ చేసిందని సింగ్ చెప్పారు. దేశ విదేశాల్లో జరిగే ఈ నేరాలకు సంబంధించి సత్వరగతిన చర్యలు తీసుకునేందుకు అవసరమైన యంత్రాంగాన్ని బలోపేతం చేయాలన్నది భారత్ లక్ష్యమని సింగ్ జి 20 ప్రతినిధులకు తెలియచేశారు. ఆర్థిక నేరస్తులు వారి స్వదేశానికి వచ్చేలా వారిపై ఒత్తిడి తీసుకురావాల్సి వుందన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడి అరెస్టును, క్రిమినల్ దర్యాప్తును తప్పించుకోవడానికి గానూ దేశం విడిచి పారిపోయే వారిని పారిపోయిన ఆర్థిక నేరస్తులుగా (ఎఫ్ఇఒ) పేర్కొంటారు. అంతర్జాతీయ ఆర్థిక సహకారానికి ప్రాథమిక వేదిక అయిన జి 20 బాధ్యత తీసుకుని అవినీతి నిర్మూలనపై పోరాడే దిశగా చర్యలు తీసుకోవాల్సి వుందని సింగ్ పేర్కొన్నారు. కాగా, జి-20 సమావేశాలకు దక్షిణ కొరియా, జపాన్ విదేశాంగ మంత్రులు డుమ్మా కొట్టారు. గత వారం ఆర్థిక మంత్రుల సమావేశాలు విఫలమయ్యాయి. దీంతో, ఈ సమావేశాలపైనా నీలినీడలు కమ్ముకున్నాయి.



సదస్సులో మాట్లాడుతున్న జితేంద్ర సింగ్

బాంబింగ్‌ను ప్రశ్నించనున్న రష్యా

నార్డ్ స్ట్రీమ్ 2 గ్యాస్ పైప్‌లైన్‌పై బాంబు దాడి అంశాన్ని విదేశాంగ మంత్రుల సమావేశంలో ప్రస్తావించాలని రష్యా భావిస్తోంది. ఈ విషయమై ఇయు, నాటోలను ప్రశ్నించాలని రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రొవ్ భావిస్తున్నారు. అలాగే స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం జరపడంపై జై శంకర్‌తో చర్చించనున్నారు.

బిబిసి కార్యాలయాలపై ఐటి సర్వేలను జై శంకర్‌తో ప్రస్తావించిన బ్రిటన్ మంత్రి

ముంబయి, ఢిల్లీల్లో బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి) కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ ఇటీవల జరిపిన దాడుల గురించి బ్రిటీష్ విదేశాంగ మంత్రి జేమ్స్ క్లవర్లీ బుధవారం భారత విదేశాంగ మంత్రి జై శంకర్ వద్ద ప్రస్తావించారు. దీనికి జై శంకర్ బదులిస్తూ దేశంలో పనిచేసే అన్ని సంస్థలూ భారతీయ చట్టాలకు అనుగుణంగా వ్యవహరించాల్సి వుంటుందని చెప్పారు. ఐటి దాడులు గురించి బ్రిటన్ ప్రభుత్వం ఇలా బహిరంగంగా ప్రస్తావించడం ఇదే మొదటిసారి. ఇంతకుముందు పార్లమెంట్‌లోనూ దీనిపై చర్చ నడిచింది. గుజరాత్ అల్లర్లలో మోడీ పాత్రపై బిబిసి రెండు భాగాలుగా ఒక డాక్యుమెంటరీని విడుదల చేసిన నేపథ్యంలో భారత ప్రభుత్వం దాన్ని అడ్డుకుంది. ఆ వెనువెంటనే ఐటి విభాగం సర్వే పేరుతో బిబిసి సోదాలు, గాలింపులు జరిగాయి.

జీడిమెట్ల ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్

- ఇద్దరు కార్మికులు దుర్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడంతో భారీ అగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల పారిశ్రామికవాడలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అరోరా ఫార్మాస్యూటికల్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో బుధవారం రియాక్టర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రియాక్టర్‌కు దగ్గరగా వున్న ఇద్దరు కార్మికులు రవీందర్‌రెడ్డి (25), కుమార్ (24) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చింది. మృతదేహాలను జీడిమెట్ల పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐఎంఎఫ్ బెయిలవుట్‌కు వ్యతిరేకంగా పిడికిలెత్తిన కార్మికవర్గం

- స్తంభించిన శ్రీలంక

5

కర్ణాటక ఉద్యోగులకు 17 శాతం ఐఆర్

- ఒపిఎస్ అమలుపై అధ్యయనానికి కమిటీ
- నిరవధిక సమ్మెతో దిగొచ్చిన కర్ణాటక బిజెపి సర్కారు



మైసూర్ నగర కార్పొరేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బెంగళూరు : కర్ణాటక ప్రభుత్వ ఉద్యోగులు అక్కడి బిజెపి సర్కారు మెడలు వంచి, తమ డిమాండ్లను సాధించుకున్నారు. బుధవారం నిరవధిక సమ్మె ప్రారంభించడంతో రాష్ట్రప్రభుత్వం దిగి వచ్చింది. బేసిక్ సేలరీపై 17 శాతం ఇంటెరిమ్ రిలీఫ్ (ఐఆర్) పెంచడానికి ప్రభుత్వం అంగీకరించింది. దీంతో సమ్మె ప్రారంభించిన కొన్ని గంటల్లోనే ఉద్యోగులు విరమించారు. ఈ విషయాన్ని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు సిఎస్ సదక్షరి ప్రకటించారు. ఉద్యోగులు వెంటనే విధుల్లోకి చేరాలని కోరారు. ఉద్యోగుల డిమాండ్ ప్రకారం జీతాల పెంపునతో పాటు జాతీయ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)ను అమలు చేయడానికి ఉండే అవకాశాలపై అధ్యయనం చేయడానికి అదనపు ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది. ఆర్థిక శాఖ అధికారులతో సమావేశం తరువాత ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఈ విషయాన్ని ప్రకటించారు. ఇతర రాష్ట్రాల్లో ప్రవేశపెట్టిన మార్పులపైనా అధ్యయనం చేయాలని కమిటీకి తెలిపినట్లు వెల్లడించారు. ఆర్థిక శాఖ అధికారులతో సమావేశంలో సదక్షరికి 17 శాతం ఐఆర్ పెంపు ఉత్తర్వుల కాపీని అందజేశారు. ఈ సందర్భంగా సదక్షరి మాట్లాడుతూ సమ్మెను విరమించినా మిగిలిన డిమాండ్లను కూడా సాధించడం కోసం ఉద్యోగులు పోరాటాన్ని కొనసాగిస్తారని చెప్పారు.

బుధవారం ఉదయం ముందుగా వేతన సవరణ, 40 శాతం ఐఆర్ పెంపు, ఎన్‌పిఎస్ రద్దు వంటి డిమాండ్లతో ఉద్యోగులు సమ్మె ప్రారంభించారు. విధులకు హాజరుకాకుండా కార్యాలయాలకు తాళాలు వేసి కార్యాలయాల ముందు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 68 రాష్ట్ర ప్రభుత్వ, దాని అనుబంధ విభాగాలకు చెందిన సుమారు ఎనిమిది లక్షల మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

వేధింపులు భరించలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కాలేజీ ఎదుట ప్రజాసంఘాల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేట్ కాలేజీ యజమాన్యం వేధింపులు భరించలేక ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన రంగారెడ్డి జిల్లా నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన సాత్విక్(16) నార్సింగ్‌లోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ యజమాన్యం వేధింపులు, ఒత్తిడికి గురిచేయడంతో తట్టుకోలేకపోయాడు. మంగళవారం రాత్రి పది గంటల సమయంలో తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన తోటి విద్యార్థులు కాలేజీ యాజమాన్యానికి తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో కొన ఊపిరితో ఉన్న సాత్విక్‌ను తోటి విద్యార్థులు ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. తమకు న్యాయం చేయాలంటూ అక్కడికి చేరుకున్న సాత్విక్ తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు కాలేజీ ఎదుట బైఠాయించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రయివేటు కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇంటర్ బోర్డు కార్యాలయం ముందు ఎస్‌ఎఫ్ఐ ఆందోళన చేపట్టింది. కాగా, కాలేజీ ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, లెక్చరర్లు ఆచార్య, శోభన్, నరేశ్ వేధింపులు తట్టుకోలేక చనిపోతున్నానంటూ రాసిన సుసైడ్ లెటర్‌ను సాత్విక్ జేబులోంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గ్రీస్‌లో ఘోరం

- రెండు రైళ్లు ఢీ : 36మంది సజీవ దహనం
- ఆ రాత్రి ఒక పీడకల అంటున్న బాధితులు

5

దళిత విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి (సత్యసాయి జిల్లా)

ఆకతాయిల వేధింపులు తాళలేక దళిత విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది.


సాయికుమారి (ఫైల్‌ఫొటో)

మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... పులేటిపల్లి పంచాయతీ పరిధిలోని కోటంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కుమార్తె సాయికుమారి (13) చెన్నేకొత్తపల్లి మండలంలోని వెంకటంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన చిరంజీవి, నారాయణస్వామి, నాగభూషణం, మహేష్ తరచూ ఆమెను వేధిస్తూ ఉండేవారు. వీరి వేధింపులు తాళలేక మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని సాయికుమారి ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పింఛను నిలిపివేయడం తుగ్లక్ చర్య

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకోలేదని పింఛను నిలిపివేయడం తుగ్లక్ చర్య అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. బాపట్లలో పింఛనును ఇంటి నిర్మాణానికి ముడిపెడుతూ ప్రజలను వేధించడం దారుణమని బుధవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఆర్థిక కష్టాలతో ఇల్లు కట్టుకోలేకపోతున్న లబ్ధిదారులపై ఇలాగేనా వ్యవహరించేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై ఇటువంటి వేధింపులు, ఒత్తిళ్ల వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్‌టిఆర్ విగ్రహ విధ్వంస కారకులపై చర్యలు

పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం ఘంటావారిపాలెంలో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. మహనీయులను అవమానించే చర్యలు ఈ ప్రభుత్వంలో పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ పాలనలో ఎన్‌టిఆర్ విగ్రహ ధ్వంసం ఘటనలు వరుసగా జరుగుతున్నా.. బాధ్యులపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

రాష్ట్రంలో గంజాయి మాఫియా

- ప్రధానికి లోకేష్ లేఖ

ప్రజాశక్తి-అమరావ తి బ్యూరో

రాష్ట్రంలో గంజాయి మాఫియా నడుస్తోందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి బుధవారం లేఖ రాశారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గంజాయి మత్తులో పిల్లలు జోగుతున్నారని విమర్శించారు. ఈ మాఫియాలో వైసిపి నాయకులు కూడా భాగస్వాములు అయ్యారని ఆరోపించారు. మాదకద్రవ్యాల దందాల్లో సంపాదించిన వేలాది కోట్లను హవాల మార్గాల్లో విదేశాలకు పంపి తిరిగి రాష్ట్రంలోకి తీసుకొస్తున్నారని విమర్శించారు. యువత, పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తిరుమలలో ఫేస్ రికగ్నైజేషన్

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి భక్తులకు ఫేస్ రికగ్నైజేషన్ అమలులోకి వచ్చింది. ఈ టెక్నాలజీని టిటిడి ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. సామాన్య భక్తులకు సులభతరంగా సేవలందించడంతో పాటుగా దళారుల నిర్మూలనకు చెక్ పెట్టేందుకు ఈ టెక్నాలజీని తీసుకువచ్చామని టిటిడి పేర్కొంది. ఇప్పటి వరకు సర్వదర్శనం భక్తులకు టోకెన్లు జారీ చేసే సమయంలో వారి ఆధార్ కార్డు నెంబర్ ను అనుసంధానం చేసి భక్తుల ఫొటో తీసుకుని టోకెన్లలను జారీ చేసేవారు. ఫొటో రికగ్నైజేషన్ విధానంతో భక్తులకు టోకెన్లు జారీ చేసే సమయంలోనే ఫొటో తీసుకుంటారు. తిరిగి వారు దర్శనానికి వెళ్ళే సమయంలోనూ ఫొటో రికగ్నైజేషన్ తీసుకున్న తర్వాతే దర్శనానికి అనుమతిస్తారు. దీంతో ఒక్కరి టోకెన్‌పై మరొకరు దర్శనానికి వెళ్లేందుకు వీలు లేదు. లడ్డులు, గదుల కేటాయింపులోనూ ఈ విధానాన్ని టిటిడి అమలు చేస్తుంది. గదులను దళారులు రోటేషన్ చేసే పద్ధతికి అడ్డుకట్ట వేయవచ్చునని, గదులు ఖాళీ చేసిన 48 గంటల్లోపు డిపాజిట్ డబ్బులు భక్తుల ఖాతాలో జమ అవుతాయని టిటిడి అధికారులు పేర్కొన్నారు.

సిఐటియు నేతలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

విశాఖ జిల్లా పరవాడ రాంకీ ఫార్మా కంపెనీలో 2020లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించేందుకు విశాఖ కెజిహెచ్‌కు వెళ్లిన సిఐటియు నాయకులపై కోవిడ్ నిబంధనలు అతిక్రమించారంటూ పోలీసులు పెట్టిన కేసును విశాఖపట్నం జిల్లా చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎన్.పద్మావతి బుధవారం కొట్టివేశారు. 2020 సెప్టెంబర్ 16న బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు కెజిహెచ్‌కు వెళ్లిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ ఆల్ ఇండియా నాయకులు టి.కామేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కెవిపి.చంద్రమౌళి, సిఐటియు అనకాపల్లి జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు బి.వెంకటరావును వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సిసి నెంబర్ 2273 /2020 కేసు పెట్టారు. సిఐటియు నాయకులు తరుపున న్యాయవాదిగా ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు కె.పూర్ణిమ వాదించారు. విశాఖపట్నం జిల్లా చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎన్.పద్మావతి నేతృత్వంలో ఈ కేసు విచారణ జరిగింది. ఈ కేసు నిరూపితం కాకపోవడంతో కేసు కొట్టివేస్తున్నట్టు జడ్జి తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్బంధ చర్యలతో పోరాటాలను, ఉద్యమాలను అణచివేయాలన్న దురుద్దేశంతో అక్రమ కేసులు బనాయిస్తుందని, ఇటువంటి కేసులకు సిఐటియు నేతలు ఎప్పుడూ భయపడరని తెలిపారు. ఈ కేసులో మంచి వాదనలు వినిపించిన అడ్వకేట్ కె.పూర్ణిమకు సిఐటియు నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు.


కోర్టు తీర్పు అనంతరం బయటకు వచ్చిన సిఐటియు నాయకులు సిహెచ్.నర్సింగరావు తదితరులు

సమావేశాల పేరుతో ఎన్నికల ప్రచారం

- ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా పట్టని ఎంఇఒ
- విశాఖ జిల్లా పద్మనాభంలో ఉపాధ్యాయులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పద్మనాభం, విశాఖ

మొన్న ఎయు విసి, నిన్న ఆనందపురం ఎంఇఒ, నేడు పద్మనాభం ఎంఇఒ ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేశారు. సమావేశాల పేరుతో ఉపాధ్యాయులను పిలిచి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విశాఖ జిల్లా పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్ హైస్కూల్‌లో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం ఉన్నట్లు పద్మనాభం మండల ఎంఇఒ శివరాణి.. ఉపాధ్యాయులకు వాట్సాప్ మెసేజ్ చేశారు. అజెండాగా విద్యాధికారుల బృందం సందర్శన సమయంలో జరిగిన ఫలితాలపై సమీక్ష, జెవికెకి సంబంధించిన సమాచారం, తరగతుల వారీగా పిల్లల రోలు వివరాలు, టాయిలెట్ మెటీరియల్ రిక్వైర్‌మెంట్ తదితర సమాచారంతో ఉపాధ్యాయులు సమావేశానికి హాజరుకావాలని, సమావేశానికి ఎమ్మెల్యే వస్తారని మెసేజ్ ద్వారా తెలిపారు. దీంతో ఉపాధ్యాయులంతా సమావేశానికి హాజరయ్యారు. ఉపాధ్యాయులందరూ వచ్చాక 'మీరు ఇక్కడ ఉండకూడదని' ఎంఇఒను ఎంపిపి పంపించేశారు. సమావేశానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపిపి కె.రాంబాబు, అధికార పార్టీ జడ్‌పిటిసి సుంకర గిరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు హాజరయ్యారు. వారంతా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలో వైసిపి అభ్యర్థికి సహకరించాలని కోరినట్లు తెలిసింది. సమావేశం బయట పోలీసులను పెట్టి ఇతరులను ఎవరినీ లోనికి అనుమతించలేదు.

దోపిడీ దొంగల బీభత్సం

- ఇద్దరు వాచ్‌మెన్లు దారుణ హత్య, మరో నలుగురిపై దాడి
- వేకువజామున ఇనుపరాడ్లతో బీతావాహం
- గుంటూరులో రెచ్చిపోయిన ఇద్దరు మైనర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో బుధవారం తెల్లవారుజామున దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. అమరావతి రోడ్డులోని అరండల్‌పేటలో షోరూమ్ షట్టర్లను పగులగొట్టి దోపిడీ చేయాలన్న తలంపుతో ఇద్దరు వాచ్‌మెన్లను హత్య చేశారు. మరో ఇద్దరిని తీవ్రంగా కొట్టి గాయపర్చారు. పరిసర ప్రాంతాల వారిపై దాడులకు పాల్పడ్డారు. కొన్ని షోరూమ్‌ల్లో దోపిడీ చేశారు. నిందితులు ఇద్దరూ మైనర్లుగా పోలీసులు గుర్తించారు.

ఈ ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో లిక్కర్ మార్టు దుకాణం వద్ద ఉన్న వాచ్‌మెన్ బత్తుల సాంబశివరావు అలియాస్ శివయ్య (62)ను కొట్టి చంపారు. మరో వైపు అమరావతి రోడ్డులోని యమహా షోరూమ్ వద్ద కాపాలాగా ఉన్న శ్రీరామ్ కృష్ణానిధి (64) అనే వాచ్‌మెన్‌ను హత్య చేశారు. ఇదే సమయంలో అరండల్ పేట 1వ అడ్డరోడ్డులో మరో చోట చోరీకి యత్నించిన దుండగులు అక్కడ అడ్డుగా ఉన్న ఏసుదాస్ అనే వాచ్‌మెన్‌పై ఇనుప రాడ్డుతో దాడి చేశారు. తలకు దెబ్బ తగలడంతో పెద్దగా కేకలు వేస్తూ అక్కడ నుంచి వాచ్‌మెన్ తప్పించుకున్నాడు. పాత గుంటూరు ప్రాంతంలో ఏసుబాబు అనే వ్యక్తిపైనా దుండగులు దాడి చేశారు.

వేకువజామున దినపత్రికలు పంపిణీ చేసే వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. సుద్దపల్లి డొంక రోడ్డులో ఓ పాల బూత్ నిర్వాహకుడిపై తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ఇనుప రాడ్డుతో దాడి చేశారు. నిందితులను 12 గంటల వ్యవధిలోనే పట్టుకున్నామని, నిందితులు ఇద్దరూ మైనర్లని ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్ తెలిపారు. వారిని విచారించగా సొమ్ము కోసం దోపిడీ చేసేందుకు అడ్డుగా ఉన్న వారిని చంపినట్టు అంగీకరించారని తెలిపారు. కేవలం దోపిడీ కోసం వచ్చి హత్యలు చేసినట్లు చెప్పారు. హత్యలు జరిగిన స్థలాలను గుంటూరు రేంజి ఐజి త్రివిక్రమ వర్మ, ఎస్.పి.ఆరీఫ్ హాఫీజ్ సందర్శించారు.

ఫలించిన ఆర్‌టిసి ఉద్యోగుల పోరాటం

- విలీనానికి ముందు మృతుల కుటుంబాలకు
- కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో ఉద్యోగ సంఘాల పోరాటం ఫలించింది. కారుణ్య నియామకాలకు సంబంధించి ప్రభుత్వంలో విలీనం కాకముందు మృతిచెందిన కుటుంబాలను గతంలో పక్కనపెట్టి కేవలం విలీనమైన 2020 జనవరి 1 తర్వాత మృతిచెందిన వారికే కారుణ్య నియామకాలు చేపట్టాలని ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఆర్‌టిసి ఉద్యోగుల దరఖాస్తులను తిరిగి జిల్లా రవాణాశాఖ అధికారికి అందజేసి ఆర్‌టిసిలోని ఖాళీల స్థానంలో నియామకాలు చేపట్టాలని పేర్కొన్నారు. మొదటి నుంచి ఈ అంశంపై ఆర్‌టిసిలోని ఉద్యోగ సంఘాలన్నీ ఆర్‌టిసిలో విలీనం కాకముందు మృతిచెందిన వారికి కూడా కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆందోళనలు చేశాయి. ఎట్టకేలకు విలీనానికి ముందు మృతిచెందిన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విలీనానికి ముందు, తర్వాత మృతి చెందిన 800 మంది ఆర్‌టిసి కుటుంబ సభ్యుల నియామకాలు చేపట్టాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆర్‌టిసిలో డ్రైవర్లు, కండక్టర్, మెకానిక్ అసిస్టెంట్ పోస్టులకు నియామకాలు తీసుకునేలా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల పట్ల ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, అయ్యపురెడ్డి, ప్రచార కార్యదర్శి దొర ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసనలు

సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర బిజెపి ప్రభుత్వం గృహావసర గ్యాస్ సిలిండర్ ధరను రూ.50, వాణిజ్య సిలిండర్ ధరను రు.350 పెంచడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రజలు ఎక్కడికక్కడ నిరసనలు వ్యక్తం చేయాలని కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, గ్యాస్ ధరలు రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు పెంచడం దారుణమని పేర్కొన్నారు. ఏడేళ్ల క్రితం వరకూ రూ.417 ఉన్న డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్ ధర నేడు రూ.1155కు పెరిగిందని వివరించారు. ప్రభుత్వం సబ్సిడీ జమ రెండేళ్ల నుంచి నిలిపివేసిందని, ఇప్పటికే గృహ వినియోగానికి సబ్సిడీ కింద ఇచ్చే సిలిండర్ల సంఖ్య కుదించారని వివరంచారు. ఇది పూర్తిగా పేద, మధ్యతరగతిపై దాడి తప్ప మరొకటి కాదని అన్నారు. వాణిజ్య సిలిండరు ఒక్కసారిగా రు.350 పెంచడం వల్ల స్వీయ ఉపాధి పొందుతున్నవారు, చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. ఆర్థిక మాంద్యంతో చితికిపోతున్న స్వయం ఉపాధి మరింత దుర్భరస్థితికి చేరుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేక, వేతనాలు చాలక ద్రవ్యోల్బణం పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం మూలిగే నక్కపై తాటి పండులా భారాలు మోపడం గర్హనీయమని అన్నారు. మరోవైపు కార్పొరేట్లకు రాయితీలిచ్చి దేశాన్ని దోచిపెడు తున్నారని పేర్కొన్నారు. వంట గ్యాస్‌ధరల పెంపును ఉపసంహరించి, సబ్సిడీని పునరుద్ధ రించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. పెంచిన ధర ఉపసంహరించే వరకు ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని ప్రజలను కోరారు.

ఐద్వా ఖండన

సామాన్యుల నడ్డివిరిచి ప్రైవేటు కంపెనీలకు లాభాలు కట్టబెట్టేందుకే ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచిందని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి విమర్శించారు. ఇప్పటికే రూ.1110 చెల్లిస్తున్నారని, చాలదన్నట్లు మరో రూ.50 మోపడం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు బియ్యం కోటా తగ్గించి, మరోవైపు గ్యాస్ ధర పెంచడమంటే పేదలు బతకలేని పరిస్థితి కల్పించడమేనని వివరించారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

- నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం దారుణం
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి : రామకృష్ణ

ప్రజాశక్తి- కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనీలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, ఎంఎల్‌సి అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా పోలీసుల ద్వారా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షం ఉండకూడదని, ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులు మాత్రమే ఉండాలని అనుకోవడం దుర్మార్గమైన ఆలోచనని పేర్కొన్నారు. అభ్యర్థులు మారువేషాల్లో వెళ్లి నామినేషన్లు వేసే దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి సిగ్గుతో తలదించుకోవాలన్నారు. అధికారి పార్టీ ప్రత్యర్థులకు ప్రపోజల్స్‌గా సంతకాలు చేసిన వారిని పోలీసులు బెదిరించడం, సంతకాలు తమవికావని, ఫోర్జరీ చేశారని వారితో చెప్పించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడానికి వైసిపి అడ్డదారులు తొక్కుతోందని విమర్శించారు. ఇలాంటి పోకడలు ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదమన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే సకాలంలో ఈ పరిశ్రమను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు వైసిపి కోల్పోతుందన్నారు.

ప్రజల పక్షాన ఉండే అభ్యర్థులనే గెలిపించండి

పశ్చిమ రాయలసీమ శాసనమండలి నియోజకవర్గ ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. వీరికి మద్దతుగా కడపలోని యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రామకృష్ణ, ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న మాట్లాడుతూ నిరంతరం ప్రజల పక్షం నిలబడి వారి తరుపున పోరాడుతున్న వారు శాసనమండలి ఎన్నికలలో నిలిచారని, వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు.

ఇంధన సామర్థ్యం అమలులో ఎపిఎస్‌ఇసిఎందే కీలకపాత్ర

- బిఇఇ డైరెక్టరు జనరల్ అభయ్ భాక్రే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన సామర్థ్య చట్టాన్ని రాష్ట్రస్థాయిలో అద్భుతంగా అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్ (ఎపిఎస్ఇసిఎం) కీలకపాత్ర పోషించిందని బిఇఇ జనరల్ డైరెక్టరు అభయ్ భాక్రే అభినందించారు. ఎపిలో దశలవారీ చేపట్టే రూ.400 కోట్ల ఇంధన సామర్థ్య ప్రాజెక్టులకు బిఇఇ సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. బిఇఇ ఆవిర్భావ సభ ఢిల్లీలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అభయ్ భాక్రే మాట్లాడుతూ.. ఎపి మోడల్ రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ (ఎస్‌ఎల్‌ఎస్‌సి)ని, కేరళ విధానాలను 18 రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని తెలిపారు. ఇంధన సామర్థ్యం, సంరక్షణ ద్వారా సుస్థిర ఇంధన ఆదా లక్ష్యాలను చేరుకోవడంలో ఎస్‌ఎల్‌ఎస్‌సి విధానం ఎంతగానో దోహపడుతుందన్నారు. 2030 నాటికి 150 మిలియన్ టన్నుల ఆయిల్ ఈక్విలెంట్‌ను ఆదా చేయాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు, రాష్ట్రాలకు అవసరమైన ప్రపంచ శ్రేణి ఇంధన సామర్థ్య సాంకేతికతలను అందించడానికి బిఇఇ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వివిధ పథకాలను ఎపిఎస్ఇసిఎం సమర్థవంతంగా అమలు చేసిందని తెలిపారు. వివిధ రంగాల్లోని భాగస్వాములతో చైతన్యం తీసుకురావడంలో అత్యంత ప్రతిభ కనబరిచిందని ఎస్ఇసిఎం సిఇఒ చంద్రశేఖర్ రెడ్డిని అభినందించారు. బిఇఇ కార్యదర్శి ఆర్‌కె రాయ్ మాట్లాడుతూ.. ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలులో ఇతర రాష్ట్రాలకు, ప్రభుత్వరంగ సంస్థలకు ఎపిఎస్ఇసిఎం దిక్సూచి అని కొనియాడారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించడంతోపాటు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. పరిశ్రమలు, రైతులు, ఎన్‌జిఒలు, స్వయం సహాయ సంఘాలు, ఉద్యోగులు, విద్యార్థులను కూడా భాగస్వాములను చేస్తోందని అభినందించారు. రాష్ట్రంలో ఇంధన సామర్థ్యాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో 6.68 ఎంటిఒఇల ఇంధన సామర్థ్య లక్ష్యాన్ని చేరుకునేందుకు అన్ని శాఖలనూ భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందని ఎపిఎస్ఇసిఎం సిఇఒ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఎపిఎస్ఇసిఎం ప్రయత్నాలు, కార్యక్రమాలను గుర్తించి, సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్న బిఇఇకి కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో యువతకు 40 శాతం సీట్లు

'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వచ్చే ఎన్నికల్లో యువతకు 40 శాతం సీట్లు కేటాయిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం గాదంకి విడిది కేంద్రం నుంచి 31వ రోజు యువగళం పాదయాత్ర ప్రారంభమయ్యింది. బుధవారానికి 400 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా నేంద్రగుంట వద్ద పిహెచ్‌సి ఏర్పాటుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇరంగారిపల్లిలో యువతతో ముఖాముఖి నిర్వహించారు. చంద్రబాబు పాలనలో జాబ్‌క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను జగన్ పాలనలో గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా రాష్ట్రం మారిపోయిందని విమర్శించారు. గూగుల్‌లో గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియా అని కొడితే ఆంధ్రప్రదేశ్ పేరు వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రతి ఏడాది జాబ్‌కేలండర్ ప్రకటించి 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఒక్క జాబ్ కూడా ఇవ్వలేదని అన్నారు. టిడిపి హయాంలో ఆరు లక్షల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే కెజి నుంచి పిజి వరకూ ప్రత్యేక పాఠ్యాంశాలు పెడతామని, మహిళలు పడే కష్టాలు, వారి గొప్పతనం, విలువ తెలిసేలా విద్యార్థి దశ నుంచే మహిళలను గౌరవించేలా తీర్చిదిద్దుతామన్నారు. పాదయాత్రలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, నాయకులు పులివర్తినాని తదితరులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పాదయాత్ర గాదంకిలో కాపు సామాజికతరగతి నాయకులతో మాటామంతీ సాగింది. ఇరంగారిపల్లిలో భోజన విరామం. గుమ్మడి వారికేంద్రం వద్ద రాత్రి బస ఏర్పాటు చేశారు.

సోము వీర్రాజు, లక్ష్మీపతిరాజాపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నమోదు చేయాలి

- వరప్రసాద్‌కు న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు
- దళిత ప్రజా సంఘాల ఐక్య వేదిక రౌండ్‌టేబుల్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

దళితుడైన వరప్రసాద్‌ను తుపాకితో బెదిరించి భూ కబ్జాకు పాల్పడిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, మీడియా కన్వీనరు లక్ష్మీపతి రాజా, వారి అనుచరులపై హత్యాయత్నం, భూ కబ్జా కేసులు, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. వరప్రసాద్‌కు ప్రాణహాని ఉందని, ఆయనతోపాటు భూమికి రక్షణ కల్పించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాల ఎదుట ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేయాలని, ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్, డిజిపికి వినతిపత్రాలు ఇవ్వాలని ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు అధ్యక్షతన విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వరప్రసాద్ 2014 మే 19న మంగళగిరి మండలం చినకాకానికి చెందిన షేక్ మగ్బూల్ నుంచి సర్వే నెంబరు 233/బిలో సుమారు 4404 చదరపు గజాలను రూ.46.50 లక్షలకు కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నాడని, డాక్యుమెంటు నెంబరు 5501/2014 అని తెలిపారు. సోము వీర్రాజు, లక్ష్మీపతి రాజా భూమి దగ్గర తమ మనుషులను పెట్టి వరప్రసాద్‌ను భూమిలోకి రానీయకుండా చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. వరప్రసాద్ భూమితోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో సిమెంటు తయారీ కోసం ఎసిసి కంపెనీ సుమారు 500 ఎకరాలు లీజు, కొంత భూమి కొనుగోలు చేసి సున్నపురాయిని తవ్వుకుని సిమెంటు ఉత్పత్తి చేసేదని, అనంతరం ఎసిసి కంపెనీ మూతబడి ఆ భూముల్లో కొంత అమ్ముకుని లీజుకిచ్చిన భూమిని తిరిగి హక్కుదారులకే ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఎసిసి కంపెనీకి లీగల్ అడ్వైజరు బద్రిరెడ్డి వెంకటరెడ్డి ఎసిసి కంపెనీకి పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్‌గా ఉన్నారని, తప్పుడు డాక్యుమెంట్లు కొనుగోలు చేసి ఇటువంటి భూములను కొనుగోలు చేస్తున్నారని వెంకటేశ్వర్లు ఆరోపించారు.

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. భూముల వివాదం నడుస్తుందని గ్రహించిన బిజెపి మీడియా కన్వీనరు లక్ష్మీపతి రాజా, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు దృష్టికి తీసుకెళ్లారని, అయన అనుచరులను పంపించి వరప్రసాద్‌ను పిలిపించి రూ.5 కోట్లు ఇస్తామని, లేకపోతే చంపేస్తామని తుపాకీ చూపి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. సమావేశానంతరం కెవిపిఎస్ నేతృత్వంలో ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో బాధితుడు వరప్రసాద్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నటరాజ్, సమతాసైనిక్ ధళ్ రాష్ట్ర అధ్యక్షులు పాలేటి మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు, భీమ్‌సేన్ సేవాధల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు నీలాంబరం, నేషనల్ దళిత పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కొక్కిరగడ్డ శ్యామ్, కులవివక్ష వ్యతిరేక ప్రచార చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు పరిశపోగు రాజేష్, ఆలిండియా రైల్వే ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు గూటాల పాపారావు, కోస్తాంధ్ర సమితి రాష్ట్ర అధ్యక్షులు సర్వేపల్లి సుదర్శనరావు, హైకోర్టు అడ్వకేట్ అప్పిగట్ల జీవరత్నం, కన్స్యూమర్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ కేశవ్, మాల మహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షులు గొట్టిపాటి రమణకుమారి, బిఎస్‌పి రాష్ట్ర నాయకులు గద్దె శ్రీకాంత్ పాల్గొన్నారు.


పార్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

ఆదర్శ మహిళా నేత జక్కా పార్వతమ్మ : ఐద్వా

ప్రజాశక్తి-నెల్లూరు

ఆదర్శ మహిళ జక్కా పార్వతమ్మ అని పలువురు వక్తలు అన్నారు. పీడిత ప్రజల కోసం జక్కా వెంకన్న చేసిన పోరాటాలు అన్నింటిల్లో ఆమె పాత్ర ఉందని, భర్త అడుగు జాడల్లో జీవితం చివరి వరకు పయనించిన పార్వతమ్మ నేటి మహిళలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన జక్కా పార్వతమ్మ సంతాప సభను నెల్లూరు జిల్లా బాలాజీనగర్‌లోని పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి భవనంలో ఐద్వా ఆధ్వర్యాన బుధవారం నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ అధ్యక్షతన జరిగిన సభలో శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ డి.అన్నపూర్ణమ్మ, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి షేక్ రెహనా బేగం, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కోరికల విజయమ్మ పాల్గొని మాట్లాడారు. తొలుత జక్కా పార్వతమ్మ చిత్రపటానికి ఐద్వా నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంలో జక్కా పార్వతమ్మ సేవలు మరువలేనివని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ నిస్వార్థంగా, నిరాడంబరంగా జీవనం సాగించారని తెలిపారు. తన బిడ్డలపై భూస్వామ్య నీడలు పడకుండా ఆదర్శంగా పెంచారన్నారు. భర్త అడుగు జాడల్లో జీవితాంతం పయనించిన ఆదర్శ నేత అన్నారు. నేటి మహిళలు జక్కా పార్వతమ్మను స్ఫూర్తిగా తీసుకొని తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకులు అరిగెల రమమ్మ, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, కె.పద్మ, ఎస్.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- రాష్ట్ర విపత్తుల సంస్థ ఎమ్‌డి అంబేద్కర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, వడదెబ్బ సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కర్నూలు జిల్లా కౌతాళం మండలంలో 39.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, ఈ నెల 1న విజయనగరం జిల్లా కొత్తవలసలో 37.8 డిగ్రీలు నమోదైందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండలు ఏప్రిల్, మే నెలల్లో మరింత తీవ్రంగా ఉంటాయని తెలిపారు. ఈసారి వడగాలుల ప్రభావం కూడా అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఎండల సమాచారం కోసం విపత్తుల సంస్థ స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 112, 1070, 18004250101కు సంప్రదించవచ్చని కోరారు. దినసరి కూలీలు ఉదయం పూటే పనులు పూర్తిచేసుకుని మధ్యాహ్నంలోగా ఇంటికి చేరాలన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - దెందులూరు (ఏలూరు జిల్లా)

ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతన్నలు బుధవారం ఆందోళనకు దిగారు. ఏలూరు జిల్లా దెందులూరులోని సహకార సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష్యం పూర్తయిందనే సాకుతో ధాన్యం కొనుగోలు చేయకపోవడం రైతులను దగా చేయడమేనని, తక్షణం ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్లలోకి లోడ్ చేసిన ధాన్యాన్ని దింపుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద టార్గెట్ కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దెందులూరు, సత్యనారాయణపురం తదితర గ్రామాల్లో రైతులు, కౌలు రైతుల నుండి మూడు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో రెండో పంటకు సాగునీరు లేకపోవడంతో అపరాల పంటలు సాగు చేసుకున్నారని, ఈ పంటలు ఉండగా ధాన్యం మాసూలు చేయడం సాధ్యం కాక ఇప్పుడు ధాన్యం కుప్పలు నూర్పిడి చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. 30 ట్రాక్టర్లకుపైగా ధాన్యాన్ని ఎత్తి కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువస్తే, టార్గెట్ పూర్తయిందంటూ ధాన్యం కొనుగోలు నిలిపివేయడం అన్యాయమన్నారు. అధికారులు కలగజేసుకుని రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అందుకు తగిన విధంగా లక్ష్యాన్ని పెంచి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రైతులకు వెంటనే గోనె సంచులు అందించాలన్నారు. రైతులు, కౌలు రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు సమస్యను రైతు సంఘం నాయకులు వ్యవసాయ శాఖ ఎడి, ఎఒల దృష్టి తీసుకెళ్లగా 300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ఆదేశాలిచ్చారు. ట్రాక్టర్లలో లోడ్ చేసిన ధాన్యాన్ని దింపుకుంటామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ధర్నాలో రైతు సంఘం నాయకులు గండి రాజా, సున్నా వెంకట్రావు, కౌలు రైతులు, రైతులు పాల్గొన్నారు.



దెందులూరు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కాకి లెక్కలతో ప్రభుత్వంపై బురద జల్లొద్దు

- మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ పథకాల పట్ల విపక్షాలు కాకి లెక్కలతో బురద జల్లే కార్యక్రమాన్ని తీసుకున్నాయని వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి విమర్శించారు. బురద జల్లే పనులను మానుకోవాలన్నారు. అమరావతిలోని సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తన హయాంలో రైతులకు ఏం చేశారో చెప్పాలన్నారు. రైతు రుణమాఫీని అమలు చేయకుండా చేతులెత్తేయడమే కాకుండా, చివరకు పంటల బీమా డబ్బులను కూడా చెల్లించ కుండా బకాయిలు పెట్టారని అన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబుకు జగన్ ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదన్నారు. చంద్రబాబును రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేనందునే లోకేష్ పాదయాత్రకు పక్క రాష్ట్రాల నుంచి జనాల్ని తీసుకొస్తున్నారని విమర్శించారు. జనసేన పార్టీని, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను తాము అసలు గుర్తించడం లేదని అన్నారు. నిబద్ధత లేని పవన్‌కల్యాణ్ గురించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ స్థాయి తోలుబొమ్మలాటలో జోకర్ మాత్రమేని ఆరోపించారు.

మచిలీపట్నంలో జనసేన ఆవిర్భావ సభ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ 10వ ఆవిర్భావ సభ ఈ నెల 14న మచిలీపట్నంలో 34 ఎకరాల సభా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భవిష్యత్తు ఎపి రాజకీయాల్లో మార్పు కోసం వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజల్ని కంకణ బద్ధుల్ని చేసే వేదికే ఈ ఆవిర్భావ సభ అని అన్నారు. జాతి గర్వించే పింగళివెంకయ్య, స్వాతంత్ర్య సమర సాయుధ పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ త్యాగాలను స్మరించుకునేలా సభా ప్రాంగణం ఉంటుందని తెలిపారు. హెలికాప్టర్ లేకుండా సిఎం 175 నియోజకవర్గాల్లో రోడ్డు మార్గాన తిరగాలన్నారు. మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, కృష్ణా జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీనివాస్ కుమార్తె రిసెప్షన్‌కు హాజరైన సిఎం

ప్రజాశక్తి - నిడదవోలు(తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కుమార్తె రిసెప్షన్ వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. బుధవారం ఉదయం 10:50 గంటలకు ఆయన గుంటూరు జిల్లా తాడేపల్లి నుంచి హెలీకాప్టర్‌లో నిడదవోలులోని సుబ్బరాజుపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో సెయింట్ అంబ్రోస్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు హాజరయ్యారు. నూతన వధూవరులు డాక్టర్ సౌమ్యశ్రీ, వెంకటశివతేజలను ఆశీర్వదించారు. అనంతరం ఆయన 11.50 గంటలకు తిరిగి హెలికాప్టర్‌లో తాడేపల్లికి పయనమయ్యారు. సిఎం వెంట మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపి భరత్‌రామ, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, చిర్ల జగ్గిరెడ్డి, కలెక్టర్ మాధవీలత, ఎస్‌పి సుధీర్‌కుమార్ తదితరులు ఉన్నారు.



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న జగన్

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-పార్వతీపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తోన్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ ఐదో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పార్వతీపురంలోని సుందరయ్య భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజెపి అధికారం చేపట్టినప్పటి నుంచి కార్పొరేట్లకు దాసోహమై సామాన్యులను, రైతులను, కార్మికులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించి దేశ ఆర్థిక వ్యవస్థనే నాశనం చేయాలని చూస్తోందని విమర్శించారు. కోట్లాదిమంది రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా చేసిందని మండిపడ్డారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను లేకుండా చేసిందని దుయ్యబట్టారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుల జీవనాన్ని దుర్భరం చేసిందన్నారు. చలో ఢిల్లీకార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు సిఐటియు మద్దతిస్తోందని, ఆమెకు మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ వాహనాన్ని తగులబెట్టిన మావోయిస్టులు

- సిబ్బందిపై దాడి

ప్రజాశక్తి - చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కుంట బ్లాక్ పరిధిలోని బండ, మురళిగూడెం గ్రామాల మధ్య బిఎస్‌ఎన్‌ఎల్ కేబుల్ పనులు నిర్వహిస్తున్న సిబ్బందిని మావోయిస్టులు అడ్డుకున్నారు. పోలీసులకు సహకరిస్తున్నారని, గతంలో హెచ్చరికలు చేసినా బేఖాతరు చేశారని ఆరోపిస్తూ ముగ్గురిని విచక్షణారహితంగా చితకబాదారు. అనంతరం బొలెరో వాహనానికి నిప్పు అంటించి తగులబెట్టారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కుంట ఏరియా కమిటీ పేరుతో లేఖను వదిలి వెళ్లారు. సమాచారం అందుకున్న కుంట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మావోయిస్టుల చేతిలో గాయపడిన జగదల్‌పూర్‌కు చెందిన దేవాంగన్, బాక్సి పటాన్, సంజయ్ కుమార్‌లను సుక్మా జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బిఎస్‌ఎన్‌ఎల్ సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయొద్దని మావోయిస్టులు గతంలో అనేకసార్లు హెచ్చరించారు.

17 నుంచి మెడీకాల్ ఎక్స్‌పో

హైదరాబాద్ : అతిపెద్ద బి2బి మెడికల్ ఉపకరణాల ట్రేడ్ ఫెయిర్ అయిన మెడీకాల్‌ను మార్చి 17 నుండి 19 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించనున్నారు. మెడ్ ఎక్స్పర్ట్ బిజినెస్ కన్సల్టెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 32వ ఎడిషన్‌లో 10,000కి పైగా ఉత్పత్తులు, సేవలతో 300 ఎగ్జిబిటర్లు పాల్గొననున్నారని మెడీకాల్ వ్యవస్థాపకులు, సిఇఒ ఎస్ మణివణ్ణన్ పేర్కొన్నారు.

'22'ఎ అమలు తాత్కాలికంగా నిలిపివేత

- శాశ్వత పరిష్కారం చూపండి : భూముల పరిరక్షణ వేదిక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'22ఎ' సెక్షన్ అమలు తాత్కాలికంగా నిలిపివేయాలని, తిరుపతి నిషేధిత ప్రాంతంలో రిజిస్ట్రేషన్లు, మార్టిగేజ్‌లు తిరిగి కొనసాగించాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారులకు బుధవారం మెయిల్ ద్వారా తాఖీదులు అందాయి. ఎండోమెంట్ కమిషనర్ హరి జవహర్‌లాల్ ద్వారా ఐజి స్టాంప్స్‌కు లేఖ అందడంతో రిజిస్ట్రేషన్లపై నిషేధాన్ని ఎత్తేవేశారు. ఇటీవల 22ఎ అమల్లోకి తెచ్చి మూడువేల ఎకరాల్లో రిజిస్ట్రేషన్లు, మార్టిగేజ్‌లు నిలిపివేస్తున్నట్లు రిజిస్ట్రేషన్ అధికారులు వెల్లడించారు. దీంతో పెద్దఎత్తున పత్రికల్లో పతాకశీర్షిక కథనాలు వచ్చాయి. అఖిలపక్షం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తిరుపతి భూముల పరిరక్షణ వేదిక ఏర్పాటై ఆందోళనలకు రూపకల్పన జరిగింది. తిరుపతిలోని భూములను నిషేధిత జాబితాలో 22ఎ చేర్చడంతో ప్రజలు ఆందోళన చెందారని, ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ తిరుపతి భూముల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ ఎఒకు వినతి పత్రం అందజేశారు. తిరుపతి భూముల పరిరక్షణ వేదిక కన్వీనర్ సాకం సుధాకర్, కో-కన్వీనర్ ఏ.రాధాకృష్ణ మాట్లాడారు. తిరుపతి ప్రజలు చేపట్టిన పోరాట ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి అభ్యంతరం లేని సర్వే నంబర్ల భూములను రిజిస్ట్రేషన్లు చేయవచ్చునని సంబంధిత శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదని, ఏదో ఒక సాకు చూపించి తిరుపతి ప్రజల జీవితాలతో చెలగాటమడే అవకాశం ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం తిరుపతి భూములపై శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

- ముఖ్య కార్యదర్శికి పంచాయతీ వర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీ కార్మికులపై రాజకీయ పరమైన వేధింపులు ఆపి, ఉద్యోగ భద్రత కల్పించాలని జిఒ 57, 132, 680ను అమలు చేయాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు నాయకులు ఉమామహేశ్వరరావు, వెంకట్రామయ్య, రామాంజనేయులు, రాము, నాగేశ్వరరావు, నాగన్న, శ్రీనివాసరావు సురేంద్ర తదితరులు పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ కార్మికుల సమస్యలు, గ్రీన్ అంబాసిడర్లపై చర్చించారు. వారిపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఆయన చర్చించి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జిఒ 57 ద్వారా ప్రతి కార్మికుడికీ రూ.పదివేలు వేతనం తగ్గకుండా చెల్లించాలని ఉందని, కానీ రూ.పది వేలకు మించకుండా జీతాలు ఇస్తున్నారని తెలిపారు. రాజకీయ వేధింపులతో నెల్లూరు, నంద్యాల, అన్నమయ్య, కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో అక్రమంగా తొలగించి వారిని రోడ్డుపాలు చేశారని పేర్కొన్నారు. అనేక పంచాయతీల్లో ఆరు నెలల నుంచి పది నెలల వరకూ వేతనాల బకాయిలు ఉన్నాయని తెలిపారు. దీనిపై తక్షణమే జోక్యం చేసుకుని టెండర్ నిలిపివేసి, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించడంతోపాటు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

దేశంలో సిటీ బ్యాంక్ కనుమరుగు

యాక్సిస్ బ్యాంక్‌లో విలీనం పూర్తి

న్యూఢిల్లీ : భారత్‌లోని సిటీ బ్యాంక్ కార్యకలాపాలు పూర్తిగా యాక్సిస్ బ్యాంక్ చేతిలోకి వెళ్లాయి. ఇకపై సిటీ బ్యాంక్ శాఖలను పూర్తిగా యాక్సిస్ బ్యాంక్ రీబ్రాండింగ్ చేయనుంది.దీంతో సిటీ బ్యాంక్ కనుమరుగు కానుంది. గతేడాది రూ.11,600 కోట్లకు సిటీ బ్యాంక్‌ను యాక్సిస్ బ్యాంక్ కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా విలిన ప్రక్రియ పూర్తి అయ్యింది. దీంతో మార్చి 1 నుంచి భారత్‌లోని సిటీ బ్యాంక్‌కు సంబంధించిన గృహ, వ్యక్తిగత, క్రెడిట్ కార్డ్ రుణాలు, సేవింగ్ ఖాతాలు తదితర సేవలు యాక్సిస్ బ్యాంక్ పరిధిలోకి వచ్చాయి. 1902లో కోల్‌కతా కేంద్రంగా సిటీ గ్రూపు భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించగా.. వందేళ్లకు పైగా సేవలను అందించింది. భారత్ సహా 13 దేశాల్లో తమ కార్యకలాపాలు రద్దు చేసుకోబోతున్నట్లు 2021లో సిటీ బ్యాంక్ ప్రకటించింది.

ఐసిసిఐ వడ్డీ రేట్లు పెంపు

న్యూఢిల్లీ : ఐసిఐసిఐ బ్యాంక్ రుణాలపై వడ్డీ రేట్లను పెంచింది. మార్జినల్ కాస్ట్ బేస్‌డ్ లెండింగ్ రేటు (ఎంసిఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు లేదా 0.10 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఒక నెల ఎంసిఎల్ఆర్ 8.40 శాతం నుంచి 8.50 శాతానికి పెరిగింది.

'ఎస్‌సి' ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్‌తో అనుసంధానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోస్ట్ మెట్రిక్ ఎస్‌సి హాస్టళ్లలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు సకాలంలో వేతనాలు అందుకునేలా ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్)తో అనుసంధానం చేసినట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 160 పోస్ట్ మెట్రిక్ ఎస్‌సి హాస్టళ్లలో వంటపని, పారిశుధ్య ఉద్యోగులుగా 411 మందికి ప్రైవేట్ సంస్థల ద్వారా వేతనాలు అందుతున్నాయి. తమకు వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నాగార్జున దృష్టికి తీసుకొచ్చారని పేర్కొంది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించినట్లు తెలిపింది. థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సేవలను ఇదివరకే మంజూరైన పోస్టుల స్థానంలో ఉపయోగించుకోవాలని, వారి వేతనాలను ఆప్కాస్ ద్వారా చెల్లించాలని అధికారుల ప్రతిపాదనకు మంత్రి నాగార్జున ఆమోదముద్ర వేశారని వివరించింది. ఆప్కాస్‌కు అనుసంధానం చేసిన 411 మందిలో 37 మందిని శ్రీకాకుళం, 52 మందిని విజయనగరం, 17 మందిని విశాఖపట్నం, 120 మందిని తూర్పుగోదావరి, 82 మందిని కృష్ణా, 62 మందిని ప్రకాశం, 41 మందిని అనంతపురం జిల్లాలకు చెందిన హాస్టళ్లకు కేటాయిస్తూ సాంఘిక సంక్షేమశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించింది.

హైదరాబాద్‌లో లుపిన్ రెఫరెన్స్ లేబరేటరీ

హైదరాబాద్ : అంతర్జాతీయ ఫార్మా కంపెనీ లుపిన్ లిమిటెడ్ (లుపిన్) తమ నూతన ప్రాంతీయ రెఫరెన్స్ లేబరేటరీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లూపిన్ లిమిటెడ్ కమ్యూనికేషన్ అండ్ సస్టెయినిబిలిటీ గ్లోబల్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ శ్వేత ముంజల్‌తో కలిసి ఆ కంపెనీ సిఇఒ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం తమ సంస్థకు 380కు పైగా లుపి మిత్రా (లుపిన్ యొక్క ఫ్రాంచైజీ కలెక్షన్ కేంద్రాలు), 23 లేబరేటరీలు ఉన్నాయన్నారు. 24వ లాబరేటరీని బాలానగర్‌లో ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2023-24 ముగింపు నాటికి దక్షిణాదిలో 200 లుపి మిత్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వచ్చే ఏడాదిలోగా విజయవాడలోనూ ఒక్క లేబరేటరీని ఏర్పాటు చేయనున్నామన్నారు. చికిత్సలో ప్రస్తుతం రోగ నిర్ధారణ పరీక్షలు అత్యంత కీలకంగా మారాయన్నారు. తమ ల్యాబ్‌ల్లో అత్యంత ఖచ్చితత్వంతో కూడిన పరీక్షా ఫలితాలను అందించేందుకు ఉన్నత ప్రక్రియలను అనుసరిస్తామన్నారు.

అదానీ ఆర్థిక అక్రమాలపై 13న 'చలో రాజ్‌భవన్'

- గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అదానీ ఆర్థిక అక్రమాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు పెనుముప్పు పొంచి ఉందని, అదానీకి వ్యతిరేకంగా ఈ నెల 6న మండల కేంద్రాల్లో ప్రచారం నిర్వహించడం, 13న చలో రాజ్‌భవన్ నిర్వహించనున్నట్లు పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తెలిపారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో అన్ని వర్గాల ఉన్నతితో కూడిన రాష్ట్రాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని, దేశంలో కాంగ్రెస్ 2024లో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎపికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు నిధులు ఇస్తామన్నారు. ఇటీవల రాయపూర్‌లో జరిగిన ఎఐసిసి 85వ ప్లీనరీ సమావేశంలో ఆమోదించిన ఆరు తీర్మానాలను ఆయన వివరించారు. సమావేశంలో పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మస్తాన్‌వలి, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, పార్టీ సీనియర్ నాయకులు గురునాథం పాల్గొన్నారు.

ఒలెక్ట్రా విద్యుత్ టిప్పర్లు వస్తోన్నాయ్..

హైదరాబాద్ : మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) అనుబంధ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఒజిఎల్) తయారు చేసిన హెవీ డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్లు ఇకపై రోడ్లపై పరుగెత్తను న్నాయి. ఈ టిప్పర్లకు హోమోలోగేషన్ సర్టిఫికెట్ పొందినట్లు ఆ కంపెనీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. భారతీయ ఆటో మొబైల్ నియంత్రణ సంస్థల నుంచి ఆమోద సర్టిఫికెట్ లభించిందని వెల్లడించింది. కేంద్ర మోటారు వాహన నింబంధనలకు అనుగుణంగా.. ఒలెక్ట్రా 6ఇ4 హెవీ డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్ రోడ్డుపైకి వచ్చేందుకు అవసరమైన అన్ని అనుమతులు సాధించామని ఆ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కెవి ప్రదీప్ తెలిపారు.

సంపాదకీయం

యథేచ్ఛగా అక్రమాలు !

శాసనమండలి ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి ప్రజలు, ఉద్యోగులు తమ వెంటే వున్నారనిపించుకునేందుకు అధికార పార్టీ నాయకులు, అనుయాయులు అడ్డదార్లు తొక్కడం, అక్రమాలకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. గ్రామ/ వార్డు సచివాలయ వాలంటీర్లను ఎన్నికల ప్రక్రియలో వినియోగించరాదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టమైన ఉత్తర్వులిచ్చినా, ఓటు దరఖాస్తులను వారి ద్వారానే సేకరించడం ద్వారా అధికార పార్టీ చట్ట ఉల్లంఘన ఓటు నమోదు ప్రక్రియతోనే మొదలయింది. గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో ఐదవ తరగతి చదివిన వారిని, మాంసం దుకాణంలో పని చేసే వ్యక్తులను ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు చేయించడం వంటి ఎన్నో అంశాలు మీడియాలో పుంఖానుపుంఖాలుగా వెలువడ్డాయి. అనర్హుల ఓట్లు నమోదు చేయాలంటూ డిఇఓలపై అధికార పార్టీ పెద్దలు ఒత్తిడి తేవడం, అందుకు అంగీకరించని వారిపై బదిలీ అస్త్రం ప్రయోగించడం అందరికీ తెలిసిందే. పెద్దల అండ ఉందికదా అని కొందరు డిఇఓల సంతకాలు ఫోర్జరీ చేసి మరీ ఓట్లు పొందిన వైనం ఆశ్చర్యం గొలుపుతోంది. (శ్రీసత్యసాయి జిల్లాలో అందుకు పాల్పడిన ముగ్గురు ప్రైవేటు స్కూల్ టీచర్లపై ఇటీవల కేసు కూడా నమోదయింది.) ఏ విద్యాసంస్థలోనూ పని చెయ్యనివారికి సైతం నకిలీ ఐడెంటిటీ కార్డులను తయారుచేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. లంచ్ బాక్సుల మొదలు వెండి భరిణెలు, ఖరీదైన సెల్‌ఫోన్‌ల వంటి ప్రలోభాల సంగతి చెప్పనక్కరలేదు.

స్థానిక సంస్థల నియోజకవర్గాల నుండి శాసన మండలి సభ్యుల ఎన్నిక సందర్భంగానూ ప్రలోభాలు, ఒత్తిళ్లు, బెదిరింపులకూ పాల్పడుతున్నట్లు ఆరోపణలు కోకొల్లలుగా వస్తున్నాయి. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించకపోవడం, కేటాయించినా వాటిని మళ్లించడం తదితర కారణాల్తో ఆ ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయం అందరికీ తెలిసిందే! ఈ నేపథ్యంలోనే కొందరు స్థానిక సంస్థల ప్రతినిధులు నామినేషన్లు దాఖలు చేయగా కేసులు బనాయిస్తామని పోలీసులను ఉసిగొల్పి బలవంతంగా వారిని ఉపసంహరింపజేస్తున్నారు. అధికార పార్టీ వారు సైతం ప్రతిపక్షాలకు ఓటు వేస్తారన్న అనుమానం ఏలినవారికి కలిగిందనీ, అందుకే ఏకగ్రీవాల కోసం సకల యత్నాలూ చేశారన్నది జనవాక్యం. అభ్యర్థులను బలవంతంగా ఉపసంహరింపజేయడం ప్రజాస్వామ్యానికి తీవ్ర హాని కలిగిస్తుంది. మరోవైపున అధికార ప్రధాన ప్రతిపక్ష పార్టీలు, కొన్నిచోట్ల శక్తివంతులైన ఇండిపెండెంట్లు క్యాంపు రాజకీయాలకు తెరలేపడం జుగుప్సాకరం.

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో వుండగానే మార్చి 1నుండి 3వతేదీ దాకా జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వైసిపి పార్టీ మండల ఇన్‌ఛార్జిలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొనాలని ఆదేశించడం దారుణం. పింఛను పంపిణీ చేసేటప్పుడు పార్టీ నాయకులు ప్రతి లబ్ధిదారుతో ఫోటో తీసుకుని మండల వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయాలని పేర్కొనడం ఎన్నికల కోడ్ ఉల్లంఘనే! ఓటర్ల జాబితా తయారీ నుండి నామినేషన్‌ల బలవంతపు ఉపసంహరణల వరకు అధికారపార్టీ అక్రమాలను, చట్ట ఉల్లంఘనలను రాతమూలకంగా, మౌఖికంగా పలు ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఎన్నికల కమిషన్‌కు నివేదించినా వాటి తీవ్రతకు తగిన విధంగా స్పందించకపోవడం తగదు. ఆ ఫిర్యాదులపై వెనువెంటనే తగు చర్యలు తీసుకోకపోవడంతో క్షేత్రస్థాయిలో అధికారపార్టీ శ్రేణులు మరింత బరి తెగించే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని ఎన్నికల్లో అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవాలి. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను నివారించాలి. శాసన మండలి ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలి. మండలి ఎన్నికల్లో ఓటర్లయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ పట్టభద్రులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులూ అప్రమత్తంగా ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రజలందరి కర్తవ్యం.



ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు సామాజిక క్రమాన్ని శత్రువులు నేరాలతోను, బలప్రయోగంతోను అణచివేయలేరు. చరిత్ర మనది. ప్రజలే చరిత్ర నిర్మాతలు...

- సాల్వెడర్ అలెండీ.

అమెరికా కుట్రలకు బలైన చిలీ అధ్యక్షుడు

విశ్లేషణ

ఈ సమ్మిట్ ఎవరి కోసం ?



సి హెచ్ నర్సింగరావు

విశాఖపట్నంలో 2023 మార్చి 3,4 తేదీల్లో భారీ ఏర్పాట్లతో ప్రపంచ పెట్టుబడిదారుల సమ్మేళనానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సన్నాహాలు సాగిస్తున్నది. 40 దేశాల నుండి ప్రతినిధులు, దేశంలోని బడా పెట్టుబడిదారులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు కొలువుదీరనున్నారు. ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబాయి, బెంగుళూర్, హైదరాబాద్‌లలో సదస్సులు పెట్టి కార్పొరేట్ కంపెనీలను విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023కు ముఖ్యమంత్రి స్వయంగా ఆహ్వానిస్తున్నారు. దేశాభివృద్ధికి పారిశ్రామిక ప్రగతి ఎంతో అవసరం. 1991లో పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో సరళీకరణ పేరుతో పారిశ్రామిక విధానాలను పూర్తిగా మార్చివేశారు. బడా పెట్టుబడిదారులకు, విదేశీ బహుళజాతి పెట్టుబడిదారులకు అనుకూలంగా పారిశ్రామిక విధానం మారిపోయింది. వామపక్ష ప్రభుత్వాలు తప్ప వీరికి రాయితీలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం మరియు అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. సింగిల్ విండోతో ప్రారంభమై నేడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 3 వారాల్లో అన్ని అనుమతులు ఇస్తూ దేశంలోనే ఫస్ట్ ర్యాంకులో ఉన్నామని జబ్బలు చరుచుకుంటోంది. కానీ గత నాలుగేళ్లలో పారిశ్రామిక అభివృద్ధికి చేసిన కృషి నామమాత్రం. పారిశ్రామిక వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటానికి నేడు ఆర్భాటంగా ప్రచారం సాగిస్తున్నారు. తమ రాజకీయ ప్రయోజనాలకు సమ్మిట్‌ను ఉపయోగించుకుంటున్నారు. కార్పొరేట్లకు భూములు అప్పగించడం తప్ప కొత్తగా పరిశ్రమలు వస్తాయని ఆశించలేం. గతంలో 2013 భూ సేకరణ చట్టాన్ని రాష్ట్రంలో నేటికీ అమలు చేయలేదు. 2016 నుండి వరుసగా 3 సంవత్సరాలు సమ్మిట్లు సాగాయి. రూ.18.6 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. కానీ వచ్చింది రూ1.84 లక్షల కోట్లుగా గత ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హిందూస్థాన్ పెట్రోలియం విస్తరణకు ఖర్చుచేసిన రూ. 25 వేల కోట్లు కూడా ఉంది. ప్రభుత్వ రంగ పెట్టుబడులను కలిపినా 10 వ వంతు కూడా వాస్తవంగా పెట్టుబడులు రాలేదు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అనేక అవకాశాల వల్ల వచ్చిన పరిశ్రమలే తప్ప సమ్మిట్ల వల్ల వచ్చింది లేదు. ఆంధ్రప్రదేశ్ వంటలు, గారెలు, బూరెలు తిని.. వచ్చిన ప్రతినిధులు ప్రభుత్వాన్ని ప్రశంసించి ఎం.ఓ.యులు చేస్తారు. విశాఖలోని రిషికొండలో డేటా సెంటర్ కోసం అదానికి 3 సార్లు 199 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాయి. 60 వేల ఉద్యోగాలు వస్తాయని అదాని ఆశలు పెట్టాడు. నేటికీ డేటా సెంటర్ నిర్మాణం కానీ, ఒక్కరికి ఉద్యోగం కానీ రాలేదు. ఇటీవల గౌతం అదాని బండారం గాలిబుడగలా బద్దలైనా ఈ సమ్మిట్‌కు ఆయనను ఆహ్వానించడంలో అర్థం ఏమిటి? పెట్టుబడిదారుల ముందు సాగిలా పడటాన్ని నలుగురు నవ్విపోతారని కూడా రాష్ట్ర ప్రభుత్వం వెనకాడటంలేదు.



పెట్టుబడిదారుల సదస్సు కోసం బుధవారం చురుకుగా జరుగుతున్న ఏర్పాట్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారులకు, విదేశీ బహుళజాతి పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తున్నాయి. కానీ దానిని కప్పి పుచ్చి పరిశ్రమల కోసం ప్రజల ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నట్లు హైడ్రామాలు ఆడుతున్నాయి. విశాఖ సమ్మిట్‌కు సుమారు రూ. 250 కోట్లు ప్రజాధనం ఖర్చు కాగలదని అంచనా వేస్తున్నారు.. రాష్ట్ర ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు అనేక రూపాల్లో రాయితీలిస్తున్నది. భూములు, గనులు, సముద్రతీరం, విద్యుత్‌ను చౌకగా పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారు. పెట్టుబడిదారులు మార్కెట్ రేటుకు రైతులు నుంచి భూములు కొనాలి. కానీ ప్రభుత్వాలే రైతులపై ఒత్తిడి చేసి బలవంతంగా రైతుల నుంచి భూములు చౌకగా లాక్కుంటున్నాయి. గత విద్యుత్ బోర్డు విధానం ప్రకారం పేదలకు విద్యుత్‌ను క్రాస్ సబ్సిడీ ద్వారా చౌకగా అందించాలి. నేడు పారిశ్రామిక వేత్తలకు విద్యుత్‌ను చౌకగా అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాలను పోటీ చూపించి రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు ఎర్ర తివాచీలు వేసి ఆహ్వానిస్తున్నాయి. మోడీ ముఖ్యమంత్రిగా ఉండగా గుజరాత్‌లోని ముంద్ర పోర్టును అదానికి అప్పనంగా అప్పగించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పోర్టులన్నింటినీ ముఖ్యమంత్రి జగన్ నేడు అదానికి అప్పగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అదాని ప్రదేశ్‌గా మారుస్తున్నారు. ఈ విధానం రాష్ట్రానికి తీవ్రమైన హాని కలిగిస్తుంది. రాష్ట్ర ప్రయోజనం ఇందులో సున్నా. కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఉల్లంఘిస్తున్నాయి. 50 లక్షల మంది షెడ్యూల్ రంగంలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు పెంచలేదు. కాని ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కార్మికుల నిజవేతనాలు పడిపోతున్నాయి.

ముఖ్యమంత్రి జగన్ ప్రతి రోజూ ఒక రంగం ప్రోత్సాహం గురించి ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఫుడ్ ప్రాసెస్ ఇండస్ట్రీ అభివృద్ధికి బ్రహ్మాండమైన అవకాశాలున్నాయని ఊదరగొట్టారు. 2022లో 6 షుగర్ ఫ్యాక్టరీలు ప్రభుత్వం మూసివేస్తూ జి.వో జారీచేసింది. షుగర్ పరిశ్రమను అభివృద్ధి చేయటానికి 'ఇథనాల్' ఉత్పత్తిని జోడించే ప్రక్రియ అన్ని ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీలూ ప్రారంభించాయి. కానీ మన రాష్ట్రంలో ముఖ్యంగా కోఆపరేటీవ్ షుగర్ ఫ్యాక్టరీలన్నింటినీ మూసివేశారు. షుగర్ ఫ్యాక్టరీల స్థలాలు అమ్ముకోవటానికే రాష్ట్ర ప్రభుత్వం ఈ కుట్ర పన్నింది. ప్రజానీకానికి వంద సంవత్సరాలు తీపి తినిపించిన చెరుకు రైతుల పొట్టలు కొట్టింది. అధికారంలోకి వచ్చిన మొదటి 3 నెలల్లోనే విశాఖలోని చిట్టివలస, విజయనగరంలోని మరో మూడు జ్యూట్ మిల్లులు మూతపడ్డాయి. ఈ పరిశ్రమల్లో పనిచేసే 15 వేల మందిని రాష్ట్ర ప్రభుత్వం నడిరోడ్డుపై నెట్టింది. పంచదార, జ్యూట్ పరిశ్రమల కంటే ఫుడ్ ప్రాసెసింగ్ గొప్పదా ? గత నాలుగేళ్లలో వచ్చిన పరిశ్రమలన్నింటిలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని? ఉన్న పరిశ్రమలు మూసివేసిన కారణంగా.. పోయిన ఉద్యోగాలు ఎన్ని ? రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం ప్రకటించాలి.

భారీ పరిశ్రమలు ఎందుకు రావడం లేదు? ప్రైవేటు అంటే లాభాలు. ఎన్ని సమ్మిట్లు పెట్టినా బాగా లాభాలు వస్తాయంటేనే పెట్టుబడిదారులు ముందుకు వస్తారు. 2008 నుండి ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం కొనసాగుతూ ఉంది. ఉపాధి భారీగా వచ్చే స్టీల్, అల్యూమినియం, జింక్, రాగి వంటి పరిశ్రమలన్ని నష్టాల్లో ఉన్నాయి. భారీ పరిశ్రమల్లో ప్రైవేటు వారు పెట్టుబడులు పెట్టడానికి శ్రద్ధ చూపటం లేదు. దీనికి కారణం పెట్టుబడులు ఎక్కువ పెట్టాలి. పరిశ్రమ నిర్మాణానికి కనీసం 5 నుండి 10 సంవత్సరాలు పడుతుంది. అంటే లాభాలు రావడానికి ఆలస్యం అవుతుంది. ప్రైవేటు పెట్టుబడిదారులకు అర్జెంట్‌గా లాభాలు కావాలి. మన రాష్ట్రంలో గత 30 సంవత్సరాల్లో ఒక్క భారీ పరిశ్రమ కూడా రాలేదు. స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్ఇజెడ్)లు మాత్రమే వస్తున్నాయి. ఈ జోన్‌లో పరిశ్రమలకు ఐదేళ్లపాటు పన్నులు ఉండవు. ఇవి సర్కస్ కంపెనీలు. కొంత కాలం తర్వాత వెళ్లిపోతాయి. తిరుపతి జిల్లా శ్రీ సిటి, అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీలు ఈ కోవకు చెందినవే. 20 సంవత్సరాల నుంచి విశాఖ - చెన్నయ్ పారిశ్రామిక కారిడార్‌లో భారీగా పరిశ్రమలు వస్తాయని ప్రభుత్వాలు ఎంత ఊదరకొట్టినా... అవి రావడంలేదు. ఈ కారిడార్‌లో ప్రతిపాదించిన కార్బన్, పెట్రో, పెట్రో రసాయనాల కాలుష్య పరిశ్రమలను ప్రజలు తిరస్కరిస్తున్నారు.

> **విశాఖలో ఏ రాజధాని లేకున్నా భారీ పరిశ్రమలు రావడానికి కారణం సముద్రతీరమే ప్రధాన కారణం. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు పెడితే భారీ పరిశ్రమలు, కాలుష్యరహిత పరిశ్రమలు బాగా అభివృద్ధి అవుతాయి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి భారీ పరిశ్రమలు సాధించాలి. అప్పడే భారీ ఉపాధి సాధ్యం. ఏపి విభజన చట్టంలోని 'ప్రత్యేక కేటగిరి హోదా' ఆంధ్ర ప్రజలహక్కు. ప్రత్యేక హోదా వస్తే పరిశ్రమలకు పన్నుల రాయితీలు వస్తాయి. పారిశ్రామికాభివృద్ధి సాధ్యమవుతుంది. బెల్లం దగ్గరకు చీమలు చేరినట్లు పన్ను రాయితీలు వస్తే పరిశ్రమలు ఆటోమెటిక్‌గా వస్తాయి. సమ్మేళనాలు అక్కర్లేదు, ప్రత్యేక హోదా లేకుండా పరిశ్రమలు పెద్దగా రావు, జగన్ పాదయాత్రలో ప్రతిసభలోనూ చెప్పిన మాటలివే. కానీ అధికారానికొచ్చాక... ప్రత్యేక హోదా గురించి రాష్ట్ర ప్రభుత్వం విన్నపాలు తప్ప కార్యాచరణ శూన్యం. ఇప్పటికైనా ప్రత్యేక హోదా సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించాలి.**

ఆంధ్రప్రదేశ్‌కు సముద్ర తీరం పారిశ్రామికాభివృద్ధికి ఎంతో అనుకూల ప్రదేశం. విశాఖలో ఏ రాజధాని లేకున్నా భారీ పరిశ్రమలు రావడానికి కారణం సముద్రతీరమే ప్రధాన కారణం. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు పెడితే భారీ పరిశ్రమలు, కాలుష్యరహిత పరిశ్రమలు బాగా అభివృద్ధి అవుతాయి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి భారీ పరిశ్రమలు సాధించాలి. అప్పుడే భారీ ఉపాధి సాధ్యం. ఏపి విభజన చట్టంలోని 'ప్రత్యేక కేటగిరి హోదా' ఆంధ్ర ప్రజలహక్కు. రాష్ట్రం విడిపోయి 8 ఏళ్లయినా ప్రత్యేక హోదా సాధించుకోలేకపోయాం. ప్రత్యేక హోదా వస్తే పరిశ్రమలకు పన్నుల రాయితీలు వస్తాయి. పారిశ్రామికాభివృద్ధి సాధ్యమవుతుంది. బెల్లం దగ్గరకు చీమలు చేరినట్లు పన్ను రాయితీలు వస్తే పరిశ్రమలు ఆటోమెటిక్‌గా వస్తాయి. సమ్మేళనాలు అక్కర్లేదు, ప్రత్యేక హోదా లేకుండా పరిశ్రమలు పెద్దగా రావు, జగన్ పాదయాత్రలో ప్రతిసభలోనూ చెప్పిన మాటలివే. కానీ అధికారానికొచ్చాక... ప్రత్యేక హోదా గురించి రాష్ట్ర ప్రభుత్వం విన్నపాలు తప్ప కార్యాచరణ శూన్యం. ఇప్పటికైనా ప్రత్యేక హోదా సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించాలి. లేకపోతే ఒట్టిమాటలు కట్టిపెట్టాలి. ప్రపంచమంతటా మాంద్యం నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రంలో భారీ పరిశ్రమలు కొత్తగా వస్తాయని, వాటి నిర్మాణాలు ప్రారంభమవుతాయని ఆశించడం ఎండమావిలో నీరు వెతకడమే ! అయితే ఆ పేరుతో ప్రచారం చేసుకోవడానికి, ఊదరగొట్టి రైతుల భూములను కార్పొరేట్ కంపెనీల భూ బ్యాంకుకు కట్టబెట్టడానికి ఉపయోగపడవచ్చు. ఈ గ్లోబల్ సమ్మిట్ ఎన్నికల ముందు ప్రచార ఆర్భాటంగా మిగులుతుందే తప్ప నిర్దిష్ట ఫలితాలు వచ్చే అవకాశం స్వల్పం.

(వ్యాస రచయిత సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

సమానత సాధనకు ఐక్య ఉద్యమాలు



డి రమాదేవి

8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మార్చి 8 మహిళా హక్కుల దినోత్సవం. 1910 నుండి క్లారా జెట్కిన్ నాయకత్వంలో ప్రపంచవ్యాప్తంగా ఉద్యమించిన దీక్షా పథం. హక్కులను సాధించుకున్న చరిత్ర. ఇది మహిళల పండుగ మాత్రమే కాదు .మహత్తర కార్యాచరణకు మార్గదర్శి కూడా .మగవారికి దీటుగా చదువుల్లో, ఉద్యోగాల్లో ముందు పీఠిన నిలబడడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నా.... నేటికీ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మహిళలు వెనుకబడే ఉన్నారు.

స్త్రీలపై హింస పెరిగింది. ఆక్స్ ఫామ్, ఐక్యరాజ్యసమితి తదితర సంస్థలు... పురుషుల కంటే మహిళల శ్రమ ఎక్కువ అని లెక్కించాయి. మధ్యతరగతి సహా మహిళలు విపరీతమైన హింసకు, సామాజికంగా అణచివేతకు, కుటుంబాలలో హింసకు గురవుతున్నారు. పురుషుల్లో మద్యం, మత్తుమందుల ప్రభావంతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. చదువుకున్న యువతులు సైతం సామాజిక అణిచివేత ఫలితంగా కట్నాలు, పెళ్లి ఖర్చుల కింద లక్షల రూపాయలు కాబోయే భర్త కుటుంబానికి చెల్లింపులు సాగుతూనే ఉన్నాయి. ఆడపిల్లలకు ఇచ్చిన ఆస్తులపై భర్త పెత్తనం అంగీకరించకపోతే వేధింపులు తగ్గడం లేదు. ఇంకా సామాజికంగా ఆమోదం పొందుతూనే ఉంది. కుటుంబ హింసనుండి రక్షణ కల్పించే ఐపిసి 498 నీరుకార్చబడింది. ఎవరైనా తమపై జరుగుతున్న వేధింపుల గురించి ఫిర్యాదు చేయబోతే పోలీస్ యంత్రాంగం గానీ, సమాజంగాని ఇంకా స్వీకరించే స్థితి లేదు.

మెజారిటీ ప్రజానీకంతోపాటుగా మహిళలు చేస్తున్న శ్రమ అనేక రూపాల్లో అదానీ, అంబానీలు, వారి మిత్రుల బొక్కసాలలో చేరుతున్నది. కోట్లాదిమంది శ్రామిక మహిళలను కార్మికులుగా గాని, ఉద్యోగులుగా గాని గుర్తించడం లేదు. ఏ విధమైన సంక్షేమ చర్యలూ లేవు. ఉన్న సంక్షేమ పథకాల మూలంగానే అభివృద్ధి లేదన్న తప్పుడు ప్రచారాలు రాజ్యమేలుతున్నాయి. అదానీలకిచ్చే రాయితీలు, సదుపాయాలు అభివృద్ధి కోసమని నమ్మబలుకుతున్నారు. గ్రామీణ వ్యవసాయ కూలీ, రైతాంగ మహిళలకు నిర్దిష్టమైన పని గంటలు లేవు. పని దొరుకుతుందన్న గ్యారెంటీ లేదు. చేసిన చాకిరీకి ఫలితం గాని, పనికి తగిన కూలి కానీ వస్తుందన్న నమ్మకం లేదు. ఉపాధి హామీ చట్టం ఉన్నా అందరికీ ఉపాధి కల్పించడం లేదు .చేసిన పనికి వేతనాలు చెల్లింపులు కూడా సరిగా లేవు. నూటికి 30శాతం కుటుంబాలు ఒంటరి మహిళలు వంటి చేతితో నడిపించాల్సిన స్థితికి నెట్టబడ్డాయి.

ఇటీవలి కేంద్ర బడ్జెట్ మహిళల కోసం ఒక్క శాతం కూడా కేటాయించలేదు. ఫలితంగా స్త్రీలలో, కుటుంబాల్లో పెరుగుతున్న కష్టాలకు, నష్టాలకు, బాధలకు విరుగుడు మేం చూపిస్తామంటూ ప్రవక్తలు, ప్రవచన కారులు మహిళలపై వల విసురుతున్నారు. వలలో చిక్కిన చేపల మాదిరిగా కొందరు భ్రమల్లో కొట్టుకుపోయి జీవిత వాస్తవాలను చూడడానికి నిరాకరించే పరిస్థితికి నెట్టబడుతున్నారు. దేవుడి దయ పేరిట నిస్సహాయులవుతున్నారు. అయినా పెరుగుతున్న కష్టాలు, ఆర్థిక మాంద్యం, ఉపాధి లేకపోవడం, ఉద్యోగాలు రాకపోవడం, వచ్చినా గ్యారెంటీ లేకపోవడం, పెరుగుతున్న కుటుంబ కలహాలు ఇవి అన్ని మహిళలను పోరాటాల్లోకి లాక్కొస్తున్నాయి.

లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయ మిత్రులైన మహిళలు విజయవాడలో మహత్తర ప్రదర్శనలో పాల్గొన్నారు. లక్షలాదిమంది స్కీం వర్కర్లు జిల్లా కలెక్టరేట్ల దగ్గర కదం తొక్కారు. భూములు కోల్పోతున్న మహిళలు, ధరల భారాన్ని మోయలేని మహిళలు, జీతాలు సక్రమంగా లేని, రాని మహిళలు వీధుల్లోకి వస్తున్నారు. వీరిపై నిర్బంధాన్ని మోపుతున్నారు. జివో నం.1, ఉపా చట్టాలు అసమ్మతిని సహించలేని నిర్బంధ చట్టాలు.

మహిళల సమానత్వాన్ని ఆకాంక్షించే శక్తులు ఈనెల 10 వ తేదీ వరకూ ఎక్కడికక్కడ బడిలో, గుడిలో, అంగన్వాడీ కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించాలి. మహిళల హక్కులను చాటి చెప్పే సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇద్దాం. హింసను అరికట్టాలి. ఉపాధి హామీలో బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. కనీస వేతనాలు అమలు చేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ధరలు తగ్గించాలి. నిత్యావసర వస్తువులను చౌక ధరలకు సబ్సిడీ మీద సరఫరా చేయాలి. మహిళల విద్యావకాశాలు హరించే నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించాలి. కేరళ రాష్ట్రం మాదిరి జెండర్ బడ్జెట్ పెంచాలి. నెలసరి సెలవులు ఇవ్వాలి. వీటి సాధనకు మహిళలతో పాటు సమానత్వాన్ని కోరే వారందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

(రచయిత ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

సెటైర్

ఫోటోగ్రాఫర్



ఇది పెళ్లిళ్ల సీజన్, రిసెప్షన్ల సీజన్. ఈ సీజనంతా పెళ్లి చుట్టూ ఉండే అవసరాలతో ఎందరికో జీవనోపాధి. వాళ్లలో ఫోటోగ్రాఫర్ ఒకరు. ఎంతో ఓపిక, సహనం, పట్టుదల ఉంటే కానీ ఈ రంగంలో ఉండడం కష్టం. కష్టమైనా సరే, వాళ్లు ఎంతో కొంత టేస్ట్ ఉండబట్టి అలా ఫోటోగ్రాఫర్లుగా నిలబడగల్గుతారు. ఇక పెళ్లిలో వీళ్ల హడావుడి అంతా ఇంతా కాదు. కొందరైతే తమ ప్రతాపాన్ని, నైపుణ్యాన్ని కలగలిపి ఎన్నెన్నో కోణాల్లో ఫోటోలు తీస్తారు. పైత్యాన్ని కూడా కలుపుతారని మా మిత్రుడంటూ ఉంటాడు. తాళి మళ్లీ కట్టమన్నా, దండ మళ్లీ వేయమన్నా, తలంబ్రాలు తిరిగి వేయమన్నా చేయాల్సిందే. అది ఫోటోగ్రాఫర్ పవరంటే. ఎందరో పురోహితులు ఈ ఫోటోగ్రాఫర్లు తమ పనికి అడ్డు తగులుతున్నారని అంటూ ఉంటారు. వీళ్లు వింటూ ఉంటారు కానీ తాము చేసేది చేస్తూనే ఉంటారు. తలంబ్రాలు వేస్తుంటే పెళ్లి కొడుకు పెళ్లి కూతుర్ల మధ్యలో దూరిపోయి పెళ్లికొడుకు తలంబ్రాల చేతుల కిందినుంచి ఫోటో తీస్తున్న ఒక ఫోటోను వాట్సప్పులో పెట్టారు మిత్రులు. అది నిజమైనా కాకున్నా వాళ్లు పడే కష్టమంతా పెళ్లివాళ్ల కోసమే కదా.

విత్ ద ఫోటోగ్రాఫర్ అని రచయిత స్టీఫెన్ లీకాక్ ఒక చిన్న కథ రాస్తాడు. నలుపు తెలుపు ఫోటోలున్న కాలంలో ఫోటో తీసుకుందామని స్టూడియోకు పోతాడు రచయిత. ఈయన మొహం చూస్తేనే ముభావంగా చూస్తాడు ఫోటోగ్రాఫర్. అంటే నీ మొహం ఫోటోకు పనికి రాదు అన్నట్టు. ఎలాగో తీయించుకొని బయటపడతాడు. చెప్పిన రోజుకు ఫోటో తీసుకుందామని పోతే ఒక ఫోటో చేతిలో పెడతాడు. ఆ ఫోటోలో కనిపించే తల, కళ్లు, ముక్కు, చెవులు తనవి కాదు, ఏమంటే అవి బాగా లేవని మార్చానంటాడు, టచప్‌లు ఇచ్చానంటాడు. ఇది నా చిత్రం కాదు, నీదగ్గరే ఉంచుకో అని బాధగా వెళ్లిపోతాడు రచయిత. ఆ కథలో ఎంతో వ్యంగ్యం ఉంటుంది. ఫోటోగ్రాఫర్లు ఇలా కూడా ఉండేవారన్నమాట. ఓ తెలుగు సినిమాలో బ్రహ్మానందానికి ఇలాంటి సీను పెట్టారు కూడా. ఇప్పుడు కూడా హెచ్.డి అని, బ్యూటిపై అని ఎవరినైనా సినిమా హీరోల్లా చూపేవాళ్లూ ఉన్నారు. సెల్లుల్లో అలా చేసేవాళ్లూ ఉన్నారు.

పెళ్లిలో ఫోటోలు, వీడియో తీస్తుంటారు కాబట్టి జనాలు ఓ క్రమశిక్షణతో కూర్చొని ఉంటారు. కొద్దిగా నవ్వు మొహం కూడా పెడుతుంటారు. సడన్‌గా డ్రోన్ కెమేరా పైనుండి పోతుంటుంది హెలికాప్టరు లాగా. అంతకు ముందు క్రేన్ లాటి యంత్రాలతో తీసేవారు. ఇలా టెక్నాలజీ కొత్త కొత్త రూపాలు ధరించినప్పుడంతా ఈ ఫోటోలు కూడా అతీతం కాదు కాబట్టి అవీ వాటిని ఉపయోగించుకుంటాయి. ఫోటొగ్రాఫర్లు లేదా ఆపరేటర్లు ఉంటేనే ఈ వీడియోలు, ఫోటోలు వస్తాయా అంటే లేదు అని సమాధానమొస్తుంది. సీసీ కెమేరాలు వాటంతట అవే ఇరవైనాలుగు ఇంటూ ఏడు అన్నట్టు పనిచేస్తుంటాయి. చివరికి క్రికెట్ మ్యాచుల్లో కూడా మూడో అంపైర్ రూపంలో వీడియో చూసి మరీ బల్లేబాజ్ అవుటా కాదా అని నిర్ణయిస్తారు. ఇక గూగుల్లో కూడా కత్రిమ ఉపగ్ర హాలు పంపే చిత్రాల ద్వారా మనం చూడొచ్చు. సినిమా షఉటింగులు తీసే ఫోటోగ్రాఫర్ల గురించి ఎంత చెప్పినా తక్కువే. అన్నిచోట్లా ఉన్నట్టుగానే అక్కడా శ్రమదోపిడీ ఉంటుంది. ఏ అవార్డో వచ్చినప్పుడు మాత్రం ఆకాశానికెత్తేస్తారు.

ముందే అనుకు న్నట్టు ఈ ఫోటోలు, వీడియోలు ఓ నిఘాగా మనం అర్థం చేసుకోవాలి. సమాజాన్ని చిత్రించే కవులు, కళాకారులు తమ కలాలతో, తమ కళారూపాలతో దేశంలో, రాజకీయాల్లో ఏమి జరుగుతోందని ఆరా తీస్తూ వాటిని ప్రజలకు చూపిస్తుంటారు. ఒక విధంగా వాళుల జరుగుతున్న దాన్ని చూపే ఫోటోగ్రాఫర్లే అనుకోవాలి. మూడో అంపైర్ వీడియో క్లిప్పింగులు చూసి నిర్ణయం ప్రకటించినట్టు మొత్తం చూసి మరీ అవుట్ చెబుతారు. అప్పుడు కానీ నిత్యం గమనించే ఫోటోగ్రాఫర్లు ఉన్నారని తెలియదు కొందరు జనాలకు.

కానీ ప్రభుత్వాలు, నాయకులు మాత్రం స్టీఫెన్ లీకాక్ కథలో మాదిరిగా ఉన్నది లేనట్టు చూపితేనే సహిస్తారు, హర్షిస్తారు. అలాంటివారినే పోషిస్తారు. ప్రోత్సహిస్తారు. పైన చెప్పుకున్న ఓపిక, సహనం, పట్టుదల ఎక్కువగా ఉండబట్టి వాళ్లు ప్రజల వైపే నిలబడతారు. కొద్దిమందైనా ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా నిలబడి ప్రజల గొంతును తమగొంతుగా వినిపిస్తారు. ప్రజలవైపు నిలబడే పత్రికల్లో రాస్తారు, ఏ టీవీయైనా ప్రజల గొంతుతోనే మాట్లాడతారు, ప్రజలకూ, నిజాలకు భయపడేవాళ్ళు ఎన్ని ట్రోలింగులు చేసినా విసుగు చెందక, సహనం కోల్పోక తాము చెప్పేది నిజం కాబట్టి తగ్గేదే లేదని మరీ దూసుకుపోతారు. వీళ్లంతా ప్రజలకు చెందిన ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లూ కాక మరేమిటి చెప్పండి!!

జంధ్యాల రఘుబాబు, 9849753298

ఈ రోజు బిజెపిలో చేరితే.. రేపే సిసోడియా విడుదల

- కేంద్రంపై కేజ్రీవాల్ ఆగ్రహం



న్యూఢిల్లీ : సిబిఐ అరెస్టు చేసిన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా 'ఒకవేళ ఈరోజు బిజెపిలో చేరితే.. రేపటికల్లా విడుదలవుతారు' అని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. తమ మంత్రుల అరెస్టు ద్వారా ఆరోగ్యం, విద్యా రంగాల్లో తమ ప్రభుత్వ కృషిని దెబ్బతీసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని చెప్పారు. 'అవినీతి అనేది విషయం కాదు. ఆ మంత్రులు చేసిన మంచి పనిని ఆపడమే దీని ఉద్దేశం' అని అన్నారు. బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఆప్‌ను ఆపాలని బిజెపి కోరుకుంటోంది. పంజాబ్‌లో మేం గెలిచినప్పటి నుంచి వారు మమ్మల్ని సహించలేకపోతున్నారు' అని అన్నారు. విద్యా మంత్రిగా మనీష్ సిసోడియా మొత్తం విద్యా నమూనాను మార్చారని, వైద్య మంత్రిగా సత్యేందర్ జైన్ ఢిల్లీకి మొహల్లా క్లినిక్‌లు ఇచ్చారని కేజ్రీవాల్ ప్రశంసించారు.

ఢిల్లీ కేబినెట్‌లోకి సౌరభ్ భరద్వాజ్, అతిషి

ఆప్ ఎమ్మెల్యేలు సౌరభ్ భరద్వాజ్, అతిషిలను మంత్రి పదవులు వరించనున్నాయి. మనీలాండరింగ్, ఢిల్లీ మద్యం కేసుల్లో అరెస్టయిన మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లు మంగళవారం మంత్రి పదవులకు రాజీనామాలు సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పదవులకు సౌరభ్ భరద్వాజ్, అతిషిలను ఎంపిక చేసి, వారి నియామకానికి సంబంధించి అవసరమైన పత్రాలను లెఫ్టినెంట్ గవర్నర్‌కు కేజ్రీవాల్ పంపినట్లు తెలుస్తోంది.

అమెరికాలో తగ్గిన వినియోగదారుల విశ్వాసం

వాషింగ్టన్ : అమెరికా ఆర్థిక వ్యవస్థలో మందగమనం పెరగడంతో అక్కడి వినియోగదారుల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అధిక వడ్డీ రేట్ల మధ్య వరుసగా రెండో నెల ఫిబ్రవరిలోనూ వినియోగదారుల విశ్వాసం పడిపోయింది. జనవరిలో ఈ సూచీ 106గా ఉండగా, ఫిబ్రవరిలో 102.9కు తగ్గింది. ఈ తగ్గుదల 35 నుండి 54 సంవత్సరాల వయసు గల కుటుంబాలకు, ముఖ్యంగా 35వేల డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ సంపాదిస్తున్న కుటుంబాల్లో అధికంగా విశ్వాసం పడిపోయిందని ది కాన్ఫరెన్స్ బోర్డ్‌లోని ఆర్థిక శాస్త్ర సీనియర్ డైరెక్టర్ మాటమాన్ ఓజిల్డిరిమ్ పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు నిలిపివేత

(మొదటి పేజీ తరువాయి)

రైతుల వద్ద పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు ఉండిపోవడంతో ఆ తర్వాత కొద్దికొద్దిగా కొనుగోలు చేశారు. సోమవారం నుంచి కొనుగోళ్లు నిల్చిపోయాయి. దీంతో, అపరాలు సాగు చేస్తున్న ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు ఉండిపోయాయి. ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలని జిల్లాల నుంచి అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీన్ని పరిగణలోకి తీసుకోకపోగా లక్ష్యం పూర్తి కాకముందే కొనుగోలు నిలుపుదల చేసింది. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పిన మాటలకు, ఆచరణకు పొంతన లేకుండా పోయింది. దీంతో, రైతులు మిల్లర్లకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. కృష్ణా జిల్లా మొవ్వ మండలం వేములమడ గ్రామానికి చెందిన వి. వెంకటేశ్వరరావు ఎంటియు 1318 వరి వంగడాన్ని ఆరు ఎకరాల్లో సాగు చేశారు. 18 రోజుల క్రితం వరి నూర్పిడి చేశారు. ఈ ధాన్యాన్ని కొనేందుకు అధికారులు ముందుకురాలేదు. దీంతో, మిల్లరుకు అమ్ముకోవాల్సి వచ్చింది. 'ఎ' గ్రేడ్‌కు 75 కిలోల బస్తాను రూ.1545కు చెల్లించాలి. మిల్లరు బస్తా ఒక్కంటికీ రూ.1250 చొప్పున 210 బస్తాలు కొనుగోలు చేశారు. బస్తా ఒక్కంటికీ రూ.295 చొప్పున రూ.61,950 వెంకటేశ్వరరావు నష్టపోయారు. లక్ష్యం పూర్తవడంతో మరో 1.68 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కృష్ణా జిల్లా అధికారులు నివేదించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీంతో, ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌కు మించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆన్‌లైన్ చేయవద్దంటూ మిల్లర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదనంగా ధాన్యం కొనుగోలు చేస్తే రైతులకు మిల్లర్లే డబ్బులు చెల్లించాలని ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు.

కొనుగోలు చేయాలి

మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. మినుము పంట ఉండడంతో కోత మిషన్ వచ్చే దారిలేక ఇప్పుడు నూర్పులు చేశాను. 75 బస్తాలు ధాన్యం వచ్చింది. కొనుగోలు చేయాలని ఆర్‌బికె సిబ్బందిని అడిగాను. లక్ష్యం పూర్తయిందని చెప్తున్నారు. ఏం చేయాలో తోచడం లేదు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– ఎన్.కృష్ణ, తోలాపి గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా

ఐఎంఎఫ్ బెయిలవుట్‌కు వ్యతిరేకంగా
పిడికిలెత్తిన కార్మికవర్గం

- ప్రభుత్వ నిషేధపుటుత్తర్వులు బేఖాతరు
- సమ్మెలో 40 కార్మికసంఘాలు
- స్తంభించిన శ్రీలంక



కొలంబో : సకల అనర్థాలకు మూలమైన ఐఎంఎఫ్ బెయిలవుట్ ప్లాన్‌పై శ్రీలంక కార్మికవర్గం కన్నెర్ర చేసింది. బుధవారం దేశవ్యాపిత సమ్మె నిర్వహించింది. దాదాపు 40 కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్యాంకింగ్, పబ్లిక్ హెల్త్, ఓడరేవులు వంటి రంగాలతో సహా సమస్త కార్మికులూ ఈ సమ్మెలో పాల్గొన్నారు. చాలా సేవలను అధ్యక్షుడు రణీల్ విక్రమసింఘె అత్యవసర సర్వీసులుగా ప్రకటించారు. ఆయా రంగాలకు చెందిన వారెవరూ సమ్మెలో పాల్గొనరాదంటూ హుకుం జారీ చేశారు. అయినా కార్మికులు ఆ ఆదేశాలను లెక్కచేయకుండా పెద్దఎత్తున సమ్మెలో పాల్గొన్నారు. పన్ను రేట్లను తగ్గించడంతో సహా తమ డిమాండ్లను నెరవేర్చని పక్షంలో బుధవారం దేశవ్యాప్త సమ్మెకు దిగుతామని వివిధ రంగాలకు చెందిన కార్మికులు గతంలోనే హెచ్చరించారు. పన్నులను పెంచడం ప్రస్తుతం అనివార్యమైన చర్య అని ఆర్థిక మంత్రి కూడా అయిన విక్రమసింఘె చెబుతూ వస్తున్నారు. అధిక పన్నుల భారాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని తమకు తెలుసునని, కానీ దేశ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించాలంటే ఈ చర్యలు తప్పవని చెప్పారు. ఐఎంఎఫ్‌ను సంతృప్తిపరచడానికే ఈ పన్ను సవరణలని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.

ఇదిలావుండగా, కేవలం అత్యవసరమైన కేసులకు మాత్రమే హాజరవుతామని కొలంబోలోని శ్రీలంక నేషనల్ హాస్పిటల్‌లోని డాక్టర్లు ఇప్పటికే ప్రకటించారు. ప్రైవేట్ ప్రాక్టీస్‌కు దూరంగా వుండాల్సిందిగా జిఎంఓఎ (ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్) తన సభ్యులను కోరింది. సెంట్రల్ కొలంబోలోని పలు ప్రాంతాల్లో బస్సులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. బ్యాంకుల కూడా ఉదయం పూట కొద్దిసేపు మాత్రమే తమ సేవలందించాయి. నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని ఉపాధ్యాయులు స్కూళ్లకు హాజరయ్యారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిరసనలు, ప్రదర్శనలు, ఆందోళనలు వుంటాయని ఇతర యూనియన్ నేతలు హెచ్చరించారు. పోర్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి నికొర్సన్ గొరకాంజె మీడియాతో మాట్లాడుతూ, "ఇది వన్ డే మ్యాచ్ మాత్రమే, రాబోయే రోజుల్లో టెస్ట్ మ్యాచ్ వుంటుంది. అందువల్ల దాన్ని నివారించాలనుకుంటే అధికారులు సత్వరమే స్పందించాల్సి వుంటుంది." అని వ్యాఖ్యానించారు.

నాలుగు సంవత్సరాల వ్యవధిలో అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుండి 29లక్షల డాలర్ల ప్యాకేజీ కావాలంటే ముందుగా అది విధించిన హానికరమైన ఆర్థిక సంస్కరణలను అమలు చేయాలి. విక్రమసింఘె ప్రభుత్వం ఇటీవల అమలు చేస్తున్న విధానాలను కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఐఎంఎఫ్ సాయం అందితే గతేడాది కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ ప్రభావాల నుండి దేశం బయటపడగలదని ప్రభుత్వం ఆశిస్తోంది. అందుకోసం ప్రభుత్వం రెండు రెట్లు పన్నులను పెంచింది. విద్యుత్ టారిఫ్‌లు మూడు రెట్లు పెరిగాయి. దాంతో వివిధ రంగాలకు కార్మికులు ఆగ్రహంతో ఉన్నారు. ద్రవ్యోల్బణం 50శాతం దాటిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడాన్ని కార్మికులు విమర్శిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 9న ఎన్నికలు జరగాల్సి వుంది. నిధుల కొరత కారణంతో ఎన్నికలు నిర్వహించలేమని ప్రభుత్వం చెబుతోంది. ఇలా ఎన్నికలు వాయిదా వేయడం ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్య అని ప్రతిపక్షం ప్రభుత్వాన్ని విమర్శించింది. పైగా ఆందోళన జరుపుతున్న కార్మికులపై పోలీసు బలగాలను పురికొల్పేలా విక్రమ సింఘె ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం పరిస్థితిని మరింత దిగజార్చింది.

పెరిగిన నిరుద్యోగిత

- ఫిబ్రవరిలో 7.45 శాతం నమోదు
- హర్యానాలో అత్యధికం, ఛత్తీస్‌గఢ్‌లో అత్యల్పం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో నిరుద్యోగ రేటు మళ్లీ పెరిగింది. ఫిబ్రవరిలో 7.45 శాతం నమోదైందని బుధవారం సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో పట్టణ నిరుద్యోగ రేటు 7.93 శాతం కాగా, గ్రామీణ నిరుద్యోగం 7.23 శాతం నమోదైంది. జనవరిలో 7.14 శాతం నిరుద్యోగ రేటు ఉండగా, ఫిబ్రవరి నాటికి 7.45 శాతానికి పెరిగింది. దేశంలో అత్యధికంగా నిరుద్యోగ రేటు నమోదైన రాష్ట్రాల్లో 29.4 శాతంతో హర్యానా మొదటి స్థానంలో నిలిచింది. 28.3. శాతంతో రాజస్థాన్ రెండో స్థానంలో నిలిచింది. 21 శాతంతో సిక్కిం, 17.1 శాతంతో జమ్ము కాశ్మీర్, 16.8 శాతంతో జార్ఖండ్, 13.9 శాతంతో హిమాచల్‌ప్రదేశ్, 12.3 శాతంతో బీహార్, 11.7 శాతంతో త్రిపుర, 11.1 శాతంతో గోవా, 8.6 శాతం ఢిల్లీ, అస్సాం, 8.2 శాతంతో పంజాబ్ తరువాత స్థానాల్లో నిలిచాయి. మిగిలిన రాష్ట్రాలన్నీ జాతీయ సగటు కంటే తక్కువ నిరుద్యోగ రేటును నమోదు చేసుకున్నాయి. 0.8 శాతంతో ఛత్తీస్‌గఢ్ అత్యల్ప నిరుద్యోగ రేటు నమోదు చేసుకుంది.

తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన నిరుద్యోగ రేటు

ఆంధ్రప్రదేశ్‌లో 6.6 శాతంతో జాతీయ సగటు కంటే తక్కువ నిరుద్యోగ రేటు నమోదైంది. ఎపిలో జనవరి నెలలో 5.5 శాతం నిరుద్యోగ రేటు నమోదు కాగా, ఫిబ్రవరి నాటికి 6.6 శాతానికి పెరిగింది. తెలంగాణలో 5.8 శాతంతో జాతీయ సగటు కంటే తక్కువ నిరుద్యోగ రేటు నమోదైంది. జనవరిలో 5.3 శాతం నిరుద్యోగ రేటు నమోదు కాగా, ఫిబ్రవరిలో 5.8 శాతానికి పెరిగింది.

సిపిఆర్‌కు ఎఫ్‌సిఆర్‌ఎ లైసెన్స్ రద్దు

న్యూఢిల్లీ : దేశరాజధాని ఢిల్లీకి చెందిన మేథో సంస్థ సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ (సిపిఆర్)కు విదేశీ విరాళాలు (నియంత్రణ) చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) లైసెన్స్‌ను 180 రోజుల వరకూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. సిపిఆర్‌కు ఎఫ్‌సిఆర్‌ఎ లైసెన్స్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం నుంచి రద్దు చేసినట్లు ఆ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు బుధవారం తెలిపారు. ఎఫ్‌సిఆర్‌ఎలో ప్రధాన నిబంధనను సిపిఆర్ ఉల్లంఘించినట్లు వెల్లడికావడంతో లైసెన్స్‌ను రద్దు చేసినట్లు చెప్పారు. గత ఏడాది సెప్టెంబర్ 7న సిపిఆర్ కార్యాలయంపై ఆదాయపన్ను శాఖ దాడులు చేసింది. విదేశీ విరాళాలు సేకరించడానికి ఎఫ్‌సిఆర్‌ఎ లైసెన్స్ తప్పనిసరి. దీనిని రద్దు చేస్తే విదేశాల నుంచి కొత్తగా విరాళాలు సేకరించడానికి వీలు కాదు. ఇప్పటికే మిగిలిఉన్న విదేశీ విరాళాలను హోం మంత్రిత్వ శాఖ అనుమతి లేకుండా వినియోగించుకోవడానికి వీలు కాదు.

భీమా కొరేగావ్ కేసులో బెయిల్ పిటిషన్లపై సమాధానం ఇవ్వండి

- ఎన్‌ఐఎకు బాంబే హైకోర్టు ఆదేశం

ముంబయి : భీమా కొరేగావ్ కేసులో నలుగురు నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ)ను బాంబే హైకోర్టు ఆదేశించింది. నిందితులు మహేష్ రావత్, సుధీర్ ధవలే, సోమా సేన్, రోనా విల్సన్ డిఫాల్ట్ బెయిల్ కోరుతూ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని జస్టిస్ ఎఎస్ గడ్కరి, జస్టిస్ పిడి నాయిక్‌లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఎన్‌ఐఎకు నోటీసులు జారీ చేసింది. వీరంతా 2018 జూన్ 6న అరెస్టయ్యారు. తమ బెయిల్ పిటిషన్‌ను పుణేలోని ప్రత్యేక కోర్టు తిరస్కరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. 'ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేయడానికి అదనపు సమయం ఇవ్వాలని కోరుతూ 2018 ఆగస్టులో పుణే సెషన్స్ కోర్టులో విచారణ అధికారి పిటిషన్ వేశారని, తరువాత నెలలోనే దానికి అంగీకరిస్తూ జడ్జి అనుమతి ఇచ్చారు' అని పిటీషన్‌లో నిందితులు తెలిపారు. అదనపు సమయం ఇవ్వడానికి, తమ డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించే అధికారం సెషెన్స్ జడ్జికి లేదని చెప్పారు. ఈ కేసులో సహ నిందితులు సుధా భరద్వాజ్‌కు 2021 డిసెంబర్ 1న బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన ప్రాతిపదికనే తమకు కూడా బెయిల్ మంజూరు చేయాలని నిందితులు కోరారు. ఈ పిటిషన్‌పై మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఎన్‌ఐఎను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో మరొక నిందితులుగా ఉన్న సురేంద్ర గాడ్లింగ్ సొంతంగా దాఖలు చేసుకున్న డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై కూడా సమాధానం ఇవ్వాలని ఎన్‌ఐఎను ఇదే ధర్మాసనం ఆదేశించింది.

బంగ్లాదేశ్-అదానీ మధ్య ఒప్పందానికి ఒత్తిడి, అవినీతే కారణం?

ఢాకా : బంగ్లాదేశ్ ప్రభుత్వం-అదానీ పవర్ మధ్య ఒప్పందం కుదరడానికి రాజకీయ ఒత్తిడి, అవినీతే కారణమని తెలుస్తోంది. ఈ ఒప్పందంపై బంగ్లాదేశ్‌కు చెందిన వార్తా సంస్థ ది డైలీ స్టార్ వివరాలు సేకరించడానికి ప్రయత్నించగా ఈ విషయాలు వెలుగుచూసాయి. అసలు బంగ్లాదేశ్‌కు ఈ ఒప్పందంపై సంతకం చేయాల్సిన అవసరం లేదని ఈ రంగానికి చెందిన ప్రముఖ నిపుణులు వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందానికి అంగీకరించే ముందు ప్రభుత్వ ప్రక్రియను తెలుసుకోవడానికి నవంబర్ 5 2017న ఈ ఒప్పందంపై సంతకం చేసిన అప్పటి బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు (బిపిడిబి) కార్యదర్శి మీనా మసూద్ ఉజ్జామాన్‌ను డైలీ స్టార్ సంప్రదించింది. 'నాకేమీ గుర్తు లేదు. బిపిడిబి ఛైర్మన్ ద్వారా ఈ ఒప్పందం వచ్చింది. నేను సంతకం చేశాను' అని మసూద్ సమాధానం ఇచ్చారు. దీంతో ఒప్పంద సమయంలో బిపిడిబి ఛైర్మన్‌గా ఉన్న ఖలీద్ మహమూద్‌ను సంప్రదించగా.. ఈ విషయంపై మాట్లాడానికి ఆయన నిరాకరించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బంగ్లాదేశ్‌లో తొలిసారిగా పర్యటించిన రెండు నెలల తరువాత ఈ ఒప్పందం కుదరడం కూడా అనేక అనుమానాలకు తావిస్తుంది. ఇది చాలా అన్యాయమైన, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకమైన ఒప్పందమని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక బంగ్లాదేశ్ లాయర్ తెలిపారు.

హెచ్‌టిటి శిక్షణా యుద్ధ విమానాల కొనుగోలుకు
కేంద్ర మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ : 70 హెచ్‌టిటి - 40 బేసిక్ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్ (బిటిఎ)లు కొనుగోలుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ యుద్ధ విమానాల కొనుగోలుకు గత ఏడాది అక్టోబర్‌లో గుజరాత్‌లో జరిగిన రక్షణ శాఖ ఎగ్జిబిషన్‌లో భారత వైమానిక దళం (ఐఎఎఫ్), హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్) మధ్య రూ.6,828.36 కోట్ల విలువైన ఒప్పందం కుదిరింది. రూ.3,108.09 కోట్లతో లార్సెన్ అండ్ టూబ్రో లిమిటెడ్ (ఎల్‌అండ్‌టి) నుంచి మూడు క్యాడెట్ ట్రైనింగ్ షిప్‌ల కొనుగోలు కోసం జరిగిన ఒప్పందానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. భారత - ఐడిడిఎం (దేశీయంగా రూపొందించబడిన, అభివృద్ధి చేయబడిన, తయారు చేయబడిన) కొనుగోలు విధానం కింద మొత్తంగా రూ.3,108,09 కోట్లతో మూడు క్యాడెట్ ట్రైనింగ్ షిప్‌ల కొనుగోలు కోసం ఎల్‌అండ్‌టితో ఒప్పందానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం కింద షిప్‌ల డెలివరీ 2026 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొంది. చైన్నై కట్టుపల్లిలోని ఎల్‌అండ్‌టి నౌకాశ్రయంలో ఈ నౌకలను దేశీయంగా డిజైన్ చేసి, అభివృద్ధి చేసి నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నాలుగున్నరేళ్ల కాలంలో 22.5 లక్షల పనిదినాల ఉపాధిని కలిగించనున్నారు. ఈ ఒప్పందం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ)తో సహా భారతీయ నౌకా నిర్మాణం, దాని అనుబంధ పరిశ్రమల క్రియాశీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుందని రక్షణ శాఖ తెలిపింది. ఈ నౌకలు కేంద్ర ప్రభుత్వం యొక్క 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' ఉద్దేశానికి అనుగుణంగా ఉంటాయని కేంద్రం పేర్కొంది.

గ్రీస్‌లో ఘోరం

రెండు రైళ్లు ఢీ : 36 మంది సజీవ దహనం



ఏథెన్స్ : గ్రీస్‌లో అత్యంత ఘోర రైలు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణికుల రైలు, సరుకు రవాణా రైలు మంగళవారం రాత్రి ఢీకొనడంతో 36మంది సజీవ దహనమయ్యారు. మరో 85మంది గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా వుంది. గత ఐదు దశాబ్దాల కాలంలో ఇంతటి దారుణమైన రైలు ప్రమాదాన్ని చూడలేదని అధికారులు పేర్కొంటున్నారు. 1972లో ఇలాగే జరిగిన ప్రమాదంలో 19మంది మరణించారు. నేటి ప్రమాదం తీవ్రతకు మొత్తంగా రైలు బోగీలన్నీ పట్టాలు తప్పాయి. ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు రావడమే ఈ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. పైగా సొరంగం నుండి పాసింజర్ రైలు బయటకు వచ్చిన వెంటనే ఈ దుర్ఘటన జరిగింది. పట్టాలు తప్పి వంగిన బోగీలు, పెద్ద ఎత్తున చెలరేగుతున్న మంటలు, నల్లని దట్టమైన పొగ, విరిగిన కిటికీలతో అక్కడ పరిస్థితి భీతావహంగా వుంది. ప్రమాదం జరిగిన సమయం రాత్రి కావడంతో కటిక చీకటి కారణంగా ప్రాథమిక సహాయక చర్యలకు ఇబ్బంది ఎదురైంది. ఒక బోగీ అయితే నిట్టనిలువునా పట్టాలపై నిలుచున్నట్లుగా వుంది. మిగిలిన బోగీలన్నీ చెల్లాచెదురుగా పడి వున్నాయి. పెద్ద కుదుపు, శబ్దంతో రైళ్లు గుద్దుకున్నాయని, ఆ వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని, తొలుత ఆ కుదుపు, శబ్దం విని భూకంపం వచ్చిందేమో అంటూ భయపడ్డామని 28 ఏళ్ల ప్రయాణికుడు స్టెర్గియోస్ మిన్నెనిస్ మీడియాతో చెప్పారు. ఆ కుదుపులకు బోగీలోనే అటూఇటూ దొర్లుతూ వున్నామని, ఆ సమయమంతా భయానకంగా గడిచిందని ఆయన చెప్పారు. రైళ్లు ఢీకొన్న వెంటనే అన్ని వైపుల నుండి మంటలు రావడంతో తప్పించుకునేందుకు కూడా కష్టమైందని, మరణించిన వారిలో మొదట బోగీల్లోని వారే ఎక్కువగా వున్నారని తెలిపారు. ఆ సమయంలో మొత్తంగా 350మంది ప్రయాణికులు వుండగా, వారిలో 250మందిని సురక్షితంగా కాపాడి బస్సుల్లో వేరే ప్రాంతానికి తరలించారు. ఇక శిథిలాల్లో వుండిపోయి, ఆచూకీ తెలియకుండా పోయిన వారిని కనుగొనడమే తమ ముందున్న అతిపెద్ద సవాలని ప్రభుత్వ ప్రతినిధి గిన్నెస్ ఒకొనుము చెప్పారు. ప్రమాద కారణాలపై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ప్రమాదం జరిగిన లారిసా ప్రాంత స్టేషన్ మాస్టర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కాలం చెల్లిన రైల్వే వ్యవస్థ

గ్రీస్‌లో కాలం చెల్లిన రైల్వే వ్యవస్థను ఆధునీకరించాల్సిన ఆవశ్యకత కనబడుతోంది. అనేక రైళ్లు సింగిల్ ట్రాక్‌పై నడుస్తు న్నాయి. అనేక చోట్ల సిగ్నలింగ్, ఆటోమేటిక్ నియంత్రణా వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సివుంది. అంతర్జాతీయ బెయి లవుట్ కార్యక్రమం కింద 2017లో రైల్వే ఆపరేటర్ ట్రెయి నోస్‌ను గ్రీస్ ప్రభుత్వం ఇటలీకి విక్రయించింది. రైల్వే మౌలిక సదుపాయాల నిర్మాణంలో పెట్టుబడులు పెడతారని ఈ అమ్మకం జరిగింది.

చైనాపై దుష్ప్రచారాన్ని ఆపని అమెరికా

- గ్లోబల్ టైమ్స్ వ్యాఖ్య

బీజింగ్ : చైనా వ్యతిరేక ప్రచారాన్ని ఉధృతం చేయాలనుకున్నప్పుడల్లా కోవిడ్ మూలాలను కనుగొనాలన్న అంశాన్ని అమెరికా తెరపైకి తీసుకొస్తోంది. గుర్తు తెలియని వస్తువులు ఆకాశంలో ఎగురుతున్నాయంటూ విపరీతంగా చేసిన ప్రచారం పూర్తిగా సద్దుమణగకముందే మళ్లీ చైనాపై దుష్ప్రచారాన్ని మొదలెట్టింది. రష్యాకు మారణాయుధాలను చైనా అందించి ఉంటుందంటూ ఆరోపణలు చేసింది. తాజాగా కోవిడ్ మూలాలపై అన్వేషణ జరగాలనే డిమాండ్‌ను మళ్లీ మొదలెట్టింది. చైనా వ్యతిరేక అంశాలను ప్రచారం చేయడంలో అమెరికన్ రాజకీయ నేతలు చాలా తెలివైన వారని గ్లోబల్ టైమ్స్ తన సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. పుకార్లను పుట్టించడం చాలా తేలిక, కానీ వాటిని తిప్పికొట్టడానికి, చాలా శక్తియుక్తులను వెచ్చించాల్సి వస్తుందని, ఎంతో శ్రమకోర్చాల్సి వుంటుందని పేర్కొంది. ఇటువంటి పుకార్ల వ్యాప్తికి అమెరికా తన ప్రభుత్వ యంత్రాంగాన్ని కూడా ఉపయోగిస్తూ వుంటుంది. కానీ వాస్తవాల ఆధారంగా చైనా ఇచ్చే వివరణలు, సమాధానాలను కనీసం వారు విననైనా వినరని సంపాదకీయం విమర్శించింది. మొత్తంగా అమెరికా సమాజామే చైనా వ్యతిరేక వైఖరితో విషపూరితమై పోయిందని పేర్కొంది. దీంతో చైనా పట్ల అమెరికా విధానంలో మార్పులకు అవకాశమే వుండడం లేదు. ఇది, అమెరికా, చైనా సంబంధాల్లో ఉద్రిక్తతలు పెచ్చరిల్లడానికి దారితీస్తోందని పేర్కొంది. గత రెండేళ్లుగా, ఏ విషయంలోనైనా చైనాను విమర్శించడానికి కోవిడ్ మూలాలు అనే అంశాన్ని అమెరికా ఒక ఆయుధంగా వాడుతూ వస్తోంది. మూలా లపై దర్యాప్తు కోసం అనేక సంస్థలను కూడా ఏర్పాటు చేసింది. ఇక్కడ అమెరికా ఉద్దేశ్యమనేది స్వచ్ఛంగా లేదు, ఎందుకంటే కోవిడ్ మూలాలపై దర్యాప్తు లేదా అన్వేషణ అనేది అంత సులభతరమైన ప్రక్రియ కాదు, అదొక సంక్లిష్టమైన, శాస్త్రీయ సర్వే. అంతర్జాతీయంగా శాస్త్రవేత్తల సహకారంతోనే నిర్వహించగలిగే వీలున్నది. కానీ అమెరికా వాటినన్నింటినీ తోసిరాజని తనదైన పద్ధతిలో ముందుకు వెళుతూ చైనాను దీనిపై నిందించడమే పనిగా పెట్టుకుందని గ్లోబల్ టైమ్స్ తన సంపాదకీయంలో విమర్శించింది.

కుంభకోణాన్ని కప్పిపుచ్చేందుకు జెలెన్‌స్కీ తంటాలు

కీవ్ : అనేక అవినీతి కుంభకోణాల కారణంగా గత నెల్లో ఉక్రెయిన్ ఉన్నతాధికారుల్లో చాలామంది తమ పదవులకు రాజీనామాలు చేశారు. దీనిపై వివాదం ఎంత త్వరగా తలెత్తిందో అంతే త్వరగా సద్దుమణిగిపోయింది. ఫిబ్రవరి ప్రారంభంలో, ఈ ప్రక్షాళన ప్రక్రియకు అంతిమంగా బలయ్యేది రక్షణ మంత్రి అలెక్సి రెజ్నికోవ్ అన్నట్లుగా వుంది. ఆయన పదవి నుండి వైదొలగడంపై ఉక్రెయిన్ పార్లమెంట్‌లో బహిరంగ చర్చ జరిగింది. అధ్యక్ష కార్యాలయం ఆయనను తొలగించే అవకాశాలు ఉన్నట్లు సంకేతాలు కూడా వెలువడ్డాయి. ఆయన రాజీనామా చేస్తారన్న ఊహాగానాలు అంతర్జాతీయ మీడియాలో కూడా చర్చకు వచ్చాయి. అయితే, రెండు వారాల తర్వాత, రెజ్నికోవ్ పశ్చిమ దేశాల నేతలతో సమావేశమవడంతో ఈ పుకార్లకు తెరపడినట్లైంది. రెజ్నికోవ్ తొలగించబడకుండా ఎలా తప్పించుకున్నారు ?, కీవ్‌లో అమెరికా ఇన్‌స్పెక్టర్ల పర్యటన ఇందులో ఎలాంటి పాత్ర పోషించింది? ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖలో జరిగిన అతిపెద్ద అవినీతి కుంభకోణం ఏమిటి? ఇలాంటి అంశాలను కప్పిపుచ్చేందుకు జెలెన్‌స్కీ, ఆయన అనుచరులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. రక్షణ మంత్రి రాజీనామాతో మొత్తంగా ఈ ప్రక్షాళన ముగుస్తుందని అందరూ ఊహించారు, కానీ అలా జరగలేదు. ఇందులో అమెరికా పాత్రపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.





మీకోసం

బెండకాయ కూర వండడానికి ముందు ముక్కలపై కొద్దిగా నిమ్మరసం పిండితే జిగురు ఉండదు.

జీవన సౌరభం

మర్యాదగా వినడం, వివేకంతో సమాధానమివ్వడం, ప్రశాంతంగా ఆలోచించడం, నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోవడం ప్రతి మనిషికీ అవసరం.


JEEVANA జీవన the family

ఓ విద్యార్థీ ...



ఓ విద్యార్థి
అర్థం కాని విషయాల్ని అడిగి
ఆసాంతం అవగాహన చేసుకోవాలి
నిర్దిష్ట భావనను మేధన
నిలుపుకోలేకపోతే
నిజమైన అవగాహన
కలిగిలేకపోతే
నిలిచిపోయేను ప్రగతి
విద్యార్థులు పాఠ్యేతర
విజ్ఞాన వీధిలోనూ విహరించాలి
అప్పుడే విజయం చేరువవుతుంది
కఠినమైనా కష్టపడి
కాల పరీక్ష నెదుర్కొని
కార్య సిద్ధి కలిగేలా
కార్యోన్ముఖులై కదలాలి
పేరుగాంచిన పెద్దల పద్ధతిలోనే గాక
నీదైన ప్రత్యేక శైలిలో
నిదానం ప్రధానంగా ఎదగాలి
నాయకత్వ లక్షణాలు
నాణ్యంగా ఎంచుకో
నడవడిక చక్కగుండాలి
నలుగురికి నచ్చి నీ దారి నడవాలి
సమస్యలు జటిలమైన
సామరస్య పూర్వకంగా
సరైన పరిష్కార సాధన చేయాలి!

- డా చిట్యాల రవీందర్
77988 91795



దారి చూపండి

చిన్నారులూ, ఇక్కడ ఉన్న చీమకి చాక్లెట్ కావాలట. మరి దారి చూపి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ



- సి. వహిత,
2వ తరగతి,
ఎంపిపి స్కూలు,
పుట్లూరు,
అనంతపురం జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ పిల్లలది గమ్యం లేని ప్రయాణం!

ఫిబ్రవరి 17..

జార్ఖండ్ రాంచీ రైల్వేస్టేషను..

ఢిల్లీ బయలుదేరే రైలు బోగీలో ఓ 13 ఏళ్ల బాలిక భయం భయంగా కూర్చొంది. పక్కనే ఆమె స్నేహితుడు అదే వయసున్న అబ్బాయి ఉన్నాడు. రైలు బయలుదేరడానికి ఇంకా చాలా సమయముంది. ఈలోపు దూరం నుండి తననే గుచ్చి గుచ్చి చూస్తున్న ఓ యువతి ఆ బాలిక దగ్గరికి వచ్చి 'ఎక్కడికి వెళ్తున్నావ్' అని గద్దించింది. 'అమ్మానాన్న దగ్గరికి' అన్నదా పాప. వాళ్లెక్కడ ఉన్నారు? అంటూ ఈసారి ఇంకాస్త స్వరం పెంచి అడిగిందా యువతి.

'ఢిల్లీలో..' అని ఠక్కున సమాధానమైతే చెప్పింది కాని భయంతో బాలిక ఒళ్లంతా చెమటలు పట్టేశాయి.

పాప పరిస్థితి చూసి కాస్త నెమ్మదించిన ఆ యువతి స్వరం తగ్గించి నువ్వు ఎక్కడికి వెళ్తున్నావో తెలుసా? అని అడిగింది. ఈసారి బాలిక గొంతు మూగబోయింది. కారణం.. ఎక్కడికి వెళ్తుంతో ఆమెకి తెలియదు. గమ్యం లేని ప్రయాణం చేస్తున్న ఆ బాలికతో పాటే ఆ రోజు మరో ముగ్గురు బాలికలు 10 నుండి 14 ఏళ్ల మధ్య వారు ఢిల్లీ వెళ్లే రైలులో ప్రయాణానికి సిద్ధంగా ఉన్నారు. కాని ఆ రోజు వారు ఢిల్లీ వెళ్లలేదు. సివిల్ డ్రెస్‌లో రైల్వే స్టేషనులో గస్తీ తిరుగుతున్న ఆ యువతి పేరు పన్నా. ఆరిపిఎఫ్ అధికారిగా తన దినచర్యలో భాగంగా ఆ రోజు ఆమె ఆ నలుగురు బాలికలను ట్రాఫికింగ్ నుండి రక్షించింది. అయితే 'వారు అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలు కాదు అంటుంది' ఆమె. 'వారంతా తల్లిదండ్రుల అనుమతితోనే రాష్ట్రం విడిచిపెడుతున్నారు. అయినా మేము వారిని రక్షిస్తూనే ఉంటాం. ఆ రైల్వే స్టేషనులో ఇలాంటి దృశ్యాలు నిత్యకృత్యం' అంటున్న ఆమె నిల్చున్న స్టేషనుకు దూరంగా ఆ బాలికలు ప్రయాణం చేసి వచ్చిన గ్రామాల్లో పరిస్థితిని చూద్దాం.

జార్ఖండ్ రాంచీ జిల్లా గుమ్లా గ్రామం అది. గ్రామాన్ని విడిచిపెట్టి వలస వెళ్లిన కొంతమంది మహిళలు సంచుల నిండా బహుమతులతో.. మోడ్రన్ దుస్తులు ధరించి, నాజుకుగా నడుచుకుంటూ గ్రామానికి తిరిగివచ్చారు. వారి వేషం, భాష గ్రామంలోని పిల్లలను తెగ ఆకర్షించేసింది. కళ్లు జిగేల్‌మనే లైటింగ్‌లతో ధగధగలాడే నోయిడా మాల్స్, 24/7 విద్యుత్ సరఫరాతో చీకటి ఎరుగని ఢిల్లీ వీధులు,





మంచినీటి సరఫరా, సౌకర్యవంత పట్టణ జీవనం గురించి కథలు కథలుగా వారు చెప్పే మాటలు గ్రామంలోని కుటుంబాలను ఊహాలోకంలోకి తీసుకెళ్తాయి. సినిమాల్లో చూపించినట్లు చేతినిండా సంపాదన, లగ్జరీ జీవితం వాళ్లను స్టార్‌డమ్ కలలుగనేలా చేస్తుంది. అయితే వాస్తవానికి జరుగుతోంది వేరు. ఆ వాస్తవాలను వివరించేవారే అక్కడ కనిపించరు.

బాధిత గొంతులు గ్రామాలకు చేరవు..

ఇటీవల గురుగ్రామ్‌కు చెందిన ఓ కుటుంబంలో భార్యాభర్త ఇద్దరూ తమ ఇంట్లో పనిచేస్తున్న 13 ఏళ్ల బాలికను అత్యంత క్రూరంగా హింసించడంతో ఆమె ఆస్పత్రి పాలైంది. ఆమె గుమ్లా గ్రామానికి చెందిన బాలికే. పనులు చేసేందుకు వెళ్లిన వారిలో చాలామంది మానసిక, శారీరక హింసకు గురవ్వడం మామూలే.. 'ప్లీజ్ రండి.. రక్షించండి. నేను అత్యాచారానికి గురయ్యాను' అంటూ శ్రీనగర్‌కు ట్రాఫికింగ్ అయిన 14 ఏళ్ల బాలిక ఒకరోజు తన తండ్రికి ఫోను చేసింది. పనిచేస్తున్న ఇంటి నుండి ఎలాగోలా తప్పించుకుని వీధుల్లో పరుగెత్తుతూ ఓ అపరిచిత వ్యక్తి నుండి ఫోను తీసుకుని తండ్రితో మాట్లాడింది. ఆమెతో పాటు మరో బాలిక కూడా గుమ్లా గ్రామం నుండి శ్రీనగర్‌కు వలసవెళ్లింది. 'మాకు రూ.19 వేలు ఇచ్చి ఇక్కడి బంగ్లాలో పనికి పెట్టారు. నాలుగ్గోడల మధ్య ఎంతో హింస అనుభవించాం. ఒక రోజు బలవంతంగా ఓ గదిలో నిర్బంధించి అనేకసార్లు అత్యాచారం చేశారు' అంటూ ఆ బాలికలు బిగ్గరగా ఏడుస్తున్న దృశ్యాలు గ్రామ పొలిమేర్లలోనే ఆగిపోతాయి. ఎందుకంటే..

'ఢిల్లీ రిటన్స్' అంటూ ఎగతాళి..

రక్షించబడిన బాలికలు గ్రామాలకు తిరిగిరావడం ఆ కుటుంబాలకు పెద్ద మచ్చలా భావిస్తారు. 'ఢిల్లీ రిటన్స్' అంటూ వారు ఎగతాళి చేయబడతారు. ఈ వేధింపులతో వారి బాధలు ఎవరితోనూ పంచుకోరు. కుటుంబంలో అబ్బాయిలు ఉత్తరప్రదేశ్, భోపాల్ ఇటుకబట్టీల్లో పనిచేసేందుకు తరలిపోతే అమ్మాయిలు దక్షిణ ఢిల్లీ, నోయిడా వంటి నగరాలకు వలసపోవడం అక్కడ సర్వసాధారణం.

భద్రమైన జీవితమన్న భ్రమలో ..

ఇటుకబట్టీల్లో బండెడు చాకిరీ చేసే బదులు ఇంటి పనివారిగా చాలా భద్రమైన జీవితం, రెట్టింపు జీతం వస్తుందన్న భ్రమే చాలామంది అమ్మాయిలను గ్రామం విడిచిపెట్టేలా చేస్తోంది. 2019లో టాటా ఇన్‌స్టిట్యూట్ సోషల్ సైన్స్ (ముంబయి) నివేదిక ప్రకారం జార్ఖండ్ వ్యాప్తంగా వలసపోతున్న జాబితాలో పది శాతం మంది 13 నుండి 18 ఏళ్ల మధ్య వారే ఉన్నారు. వారిలో 55 శాతం మంది షెడ్యూల్ ఆదివాసీలని తేలింది. బిషన్‌పూర్ బ్లాక్ గ్రామం నుండే నెలకు నాలుగు నుండి ఐదుగురు పిల్లలు రాష్ట్రం దాటి ఢిల్లీ ఇళ్లల్లో పనులకు వెళ్తున్నారు.

పిల్లలను అమ్ముకునేందుకే సిద్ధం..

'ఆకలితో చావడం కంటే పిల్లలను అమ్ముకుంటే మెరుగైన జీవితం అనుభవించవచ్చని జార్ఖండ్ గ్రామాల్లో చాలామంది తల్లిదండ్రులు భావిస్తున్నారు. అక్కడ వర్షం వస్తేనే పంట పండుతుంది. మిగిలిన కాలంలో పనులు వెదుక్కుంటూ వలస వెళ్లిపోతారు. పిల్లలతో సహా కుటుంబాలన్నీ కదిలిపోవడంతో ఊళ్లు ఖాళీ అయిపోతాయి. అలా వెళ్తున్న వారితో డీల్ కుదుర్చుకునేందుకు దళారులు గుంపులు గుంపులుగా ప్రత్యక్షమవుతారు. 'మీ పిల్లలను మాతో పంపించండి. పెద్ద పెద్ద భవంతుల్లో పనుల్లోకి పెడతాం. నెలకు రూ.20 వేల ఆదాయం పొందవచ్చని వారిని మభ్యపెడతారు. మొదట్లో ఆ కుటుంబానికి క్రమం తప్పకుండా డబ్బులు పంపించిన దళారులు ఆ తరువాత చెల్లించడం మానేస్తారు. మోసగించబడిన తరువాతే ఆ కుటుంబాలు పోలీసులను సంప్రదిస్తారు.

దిశ మారుతున్న వలసలు

ఉత్తర భారతంలో ఇటువంటి సంఘటనలు తరచూ జరగడంతో గ్రామస్తులు ఈసారి తమ పిల్లలను దక్షిణభారతం పంపించేందుకు సిద్ధమవుతున్నారు. అలా తన ముగ్గురు కూతుళ్లను చెన్నైకి పంపిన 47 ఏళ్ల జీహన్ గుత్వా 'నా పిల్లలు అక్కడ క్షేమంగా ఉన్నారు. బాగా సంపాదిస్తున్నారు' అంటూ చెబుతున్నాడు. 'కానీ అతనికి తెలియని విషయమేమంటే ట్రాఫికింగ్ సంస్థల ముసుగులో గ్రామం నుండి పనులకు వెళ్లిన అమ్మాయిలు బంగ్లాలో పనులకే కాదు.. వేశ్యాగృహాలకు అమ్ముడై దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారు' అంటారు ట్రాఫికింగ్ నిరోధ సహాయ సంస్థ నిర్వాహకులు వీర్. 'ఓ ట్రాఫికింగ్ సంస్థ యజమాని 5 వేల మంది పిల్లలను విక్రయించి ఒక్క ఏడాదిలో రూ.80 కోట్లు సంపాదించినట్లు పోలీసు రికార్డుల్లో నమోదైన విషయాన్ని కూడా ఆయన బహిర్గతం చేశారు.

జార్ఖండ్ ఒక్క చోటే కాదు.. దేశవ్యాప్తంగా ఈ దృశ్యాలు మనకు కనపడతాయి. హింసను భరిస్తూ గ్రామాలకు తిరిగి వెళ్లలేని ఎంతోమంది బాలల జీవితాలు ఇటుకబట్టీల్లో.. వేశ్యాగృహాల్లో.. యజమానుల కబంధ హస్తాల్లో చిక్కుకుపోతున్నాయి.



సుబ్బారావు గుప్తా అరెస్ట్

- గంజాయి కేసు పెట్టిన పోలీసులు
- గతంలో 'బాలినేని'పై విమర్శలు చేసిన 'సోమిశెట్టి'

ప్రజాశక్తి- ఒంగోలు క్రైం

ప్రకాశం జిల్లా ఒంగోలు వైసిపిలోని రెబల్ కార్యకర్తగా ఉన్న సోమిశెట్టి సుబ్బారావు గుప్తాపై తాలూకా పోలీస్ స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా కేసు నమోదైంది. ఆయనను పోలీసులు బుధవారం అరెస్టు చేసి విచారిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఒంగోలులోగల వెంకటేశ్వర కాలనీ అడ్డరోడ్డులోని టీ స్టాల్ వద్ద పోలీసులు ఉన్నారు. అదే సమయంలో మోటార్ సైకిల్‌పై ఒంగోలు వైపు వెళ్తున్న సుబ్బారావు గుప్తా వారిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో, పోలీసులు ఆయనను వాహనంతో సహా పట్టుకొని విచారించారు. తన వాహనంలోని సంచిలో గంజాయి ఉందని, అందుకే మిమ్మల్ని చూసి పారిపోతున్నానని పోలీసులకు సుబ్బారావు గుప్తా చెప్పారు. పోలీసులు ఆయన నుంచి ఒక కిలో ఐదు గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గుప్తాను అరెస్టు చేసి గంజాయి కేసు నమోదు చేశామని, ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయనపై క్రైమ్ నెంబర్ 81/ 2022 యుఎస్ ఎస్‌సి/ఎస్‌టి సెక్షన్ క్రింద గతంలో ఒక కేసు నమోదై ఉందని డిఎస్‌పి నాగరాజు తెలిపారు.

గుప్తాపై గతంలో దాడి

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిపై గతంలో చాలాసార్లు సుబ్బారావు గుప్తా విమర్శలు చేశారు. దీంతో, బాలినేని అనుచరుల నుంచి బెదిరింపులు రావడంతో గుంటూరు వెళ్లి ఆయన తలదాచుకున్నారు.

బాలినేని అనుచరులు అక్కడికి వెళ్లి మరీ గుప్తాపై దాడి చేశారు. ఇది సోషల్ మీడియాలో అప్పట్లో వైరల్ అయింది. రాష్ట్ర స్థాయిలో ఆర్యవైశ్య నాయకులు గుప్తాకు అండగా రావడంతో వైసిపి ముఖ్య నేతలు సమస్య తీవ్రతరం కాకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటన తర్వాత కూడా బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డిపై నగరంలో భూకబ్జాలు, ఇతర అంశాలపై సుబ్బారావు గుప్తా ఆరోపణలు చేస్తూనే ఉన్నారు.

వైసిపి ముఖ్యనేతలకు వ్యతిరేకంగా ఢిల్లీలోనూ నిరసన తెలిపారు. కేంద్రంలోని పెద్దలనూ కలిశారు. రెండు రోజుల క్రితం బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశాడు. ఈ నేపథ్యంలో సుబ్బారావు గుప్తాపై గంజాయి కేసు నమోదు కావడం, ఆయనను అరెస్టు చేయడం చర్చనీయాంశమైంది.

మహిళా సంఘాల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మెప్మా ఆధ్వర్యాన మహిళా సంఘాలు తయారుచేస్తున్న ఉత్పత్తులకు వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోని షీ ట్రేడ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని ఐక్యరాజ్య సమితి స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ సభ్యులు షకీన్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై శ్రీలక్ష్మి, మెప్మా మిషన్ డైరెక్టర్ వి విజయలక్ష్మితో కలిసి రాష్ట్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యాన వస్తున్న ఉత్తత్తుల గురించి బుధవారం ఆయన అడిగి తెలుసుకున్నారు.

మెప్మా ద్వారా పట్టణాల్లోని స్వయం సహాయక సంఘ సభ్యుల సుస్థిర జీవనోపాధులను పెంపొందించుటకు జగనన్న మహిళా మార్ట్‌లను, జగనన్న -మార్ట్‌లను ఏర్పాటు చేసి తద్వారా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెట్‌ను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విజయలక్ష్మి వివరించారు. మహిళలకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందిస్తున్నామని తెలిపారు. మహిళా ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించే దిశగా మెప్మాతో కలిసి ప్రణాళికను రూపొందిస్తామని షకీన్‌కుమార్ పేర్కొన్నారు.

109 పరుగులకే ఆలౌట్

ఆసీస్ స్పిన్నర్ల దెబ్బకు క్యూ కట్టిన టీమిండియా బ్యాటర్స్

ఆస్ట్రేలియా 156/4



ఇండోర్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా హోల్కర్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న మూడోటెస్ట్‌లో తొలిరోజు స్పిన్నర్ల హవా కొనసాగింది. దీంతో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను ఆసీస్ స్పిన్నర్లు కుహ్నెమన్, లియాన్ దెబ్బతీసారు. దీంతో భారతజట్టు ఇన్నింగ్స్ 33.2 ఓవర్లలో 109పరుగులకే ఆలౌటైంది. విరాట్ కోహ్లి (22), శుభ్‌మన్(21) మాత్రమే రెండు పదుల స్కోర్ చేసారు. టీమిండియా ఆటగాళ్లు పరుగు లు చేయడంలో విఫలమయ్యారు. ఆసీస్ స్పిన్నర్ల ధాటికి వరుసగా వికెట్లు పారేసుకున్నారు. కోహ్లి, గిల్ తర్వాత.. ఉమేశ్ యాదవ్(17) శ్రీకర్ భరత్ (17), అక్షర్ పటేల్(12), రోహిత్ శర్మ(12) రెండంకెల స్కోర్ చేయగలిగారు. మిగిలిన ప్లేయర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఆసీస్ బౌలర్ల లో మాథ్యూ కుహ్నెమాన్‌కు ఐదు, నాథన్ లియాన్ కు మూడు వికెట్లు దక్కాయి. టాడ్ మర్ఫీకి ఒక వికెట్ లభించింది.

ఖవాజా అర్ధసెంచరీ

టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 109 పరుగులకే కాగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు నష్టపోయి 156 పరుగులు చేసింది. దీంతో ఆస్ట్రేలియా జట్టుకు ఇప్పటికే 47 పరుగుల ఆధిక్యత లభించింది. ఉస్మాన్ ఖవాజా (60) అర్ధసెంచరీతో రాణించగా.. మార్నస్ లబుషేన్(31), స్టీవ్ స్మిత్(26) పర్వాలేదనిపించారు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్(9) విఫలమయ్యాడు. ఆసీస్ కోల్పోయిన నాలుగు వికెట్లను రవీంద్ర జడేజా పడగొట్టాడు. రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా ఏడు వికెట్లు తీసిన జడేజా.. మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అద్భుత బౌలింగ్‌తో అలరిస్తున్నాడు.

స్కోర్‌బోర్డు..

భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (స్టంప్)క్యారీ (బి)కుహ్నెమన్ 12, శుభ్‌మన్ (సి)స్మిత్ (బి)కుహ్నెమన్ 21, పుజారా (బి)లియాన్ 1, కోహ్లి (ఎల్‌బి)మర్ఫీ 22, జడేజా (సి)కుహ్నెమన్ (బి)లియాన్ 4, శ్రేయస్ (బి)కుహ్నెమన్ 0, శ్రీకర్ భరత్ (ఎల్‌బి)లియాన్ 17, అక్షర్ (నాటౌట్) 12, అశ్విన్ (సి)క్యారీ (బి)కుహ్నెమన్ 3, ఉమేశ్ (ఎల్‌బి) కుహ్నెమన్ 17, సిరాజ్ (రనౌట్) హెడ్/లియాన్ 0, అదనం 0. (33.2 ఓవర్లలో 109ఆలౌట్) **వికెట్ల పతనం:** 1/27, 2/34, 3/36, 4/44, 5/45, 6/70, 7/82, 8/88, 9/108, 10/109 **బౌలింగ్:** స్టార్క్ 5-0-21-0, గ్రీన్ 2-0-14-0, కుహ్నెమన్ 9-2-16-5, లియాన్ 11.2-2-35-3, మర్ఫీ 6-1-23-1.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ట్రివిస్ ఎహెడ్ (ఎల్‌బి)జడేజా 9, ఖవాజా (సి)శుభ్‌మన్ (బి)జడేజా 60, లబూషేన్ (బి)జడేజా 31, స్మిత్ (సి)శ్రీకర్ భరత్ (బి)జడేజా 26, లబూషేన్ (బ్యాటింగ్) 7, గ్రీన్ (బ్యాటింగ్) 6, అదనం 17. (54 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 156పరుగులు. వికెట్ల పతనం: 1/12, 2/108, 3/125, 4/146 **బౌలింగ్:** అశ్విన్ 16-2-40-0, జడేజా 24-6-63-4, అక్షర్ 9-0-29-0, ఉమేశ్ 2-0-4-0, సిరాజ్ 3-0-7-0

ముంబయి ఇండియన్స్ కెప్టెన్‌గా హర్మన్

ముంబయి: మహిళల ప్రిమియర్‌లీగ్(డబ్ల్యుపిఎల్) ముంబయి ఇండియన్స్ కెప్టెన్ కెప్టెన్‌గా భారతజట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ నియమించబడింది. ఈ విషయాన్ని ఆ ఆ ఫ్రాంచైజీ బుధవారం ట్విటర్ వేదికగా వెల్లడించింది. 'హర్మన్ ప్రీత్ కెప్టెన్‌గా ఉండడం మాకు చాలా ఆనందంగా ఉంది' అని జట్టు యజమానికి నీతా అంబానీ బుధవారం మీడియాకు తెలిపారు. హర్మన్ ప్రీత్ కౌర్‌ను ముంబయి ఫ్రాంచైజీ రూ.1.80కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. హర్మన్ ఇటీవల 150టి20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన తొలి క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పింది.

ఆస్కార్ వేదికపై 'నాటు నాటు..'



'ఆస్కార్' వేదికపై 'నాటు నాటు' పాట పాడే అవకాశం ఇచ్చినట్లు అకాడమీ బృందం వెల్లడించింది. ఈ మేరకు మార్చి 12న లాస్‌ఏంజెల్స్‌లో జరగనున్న ఆస్కార్ వేడుకల్లో గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ 'నాటు నాటు' పాట పాడనున్నారు. ఉత్తమ ఒరిజినల్ సాంగ్ కేటగిరిలో 'నాటు నాటు' పాట ఆస్కార్‌కు నామినేట్ అయిన విషయం తెలిసిందే. 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' నుండి 'దిస్ ఈజ్ ఏ లైఫ్', 'టెల్ ఇట్ లైక్ ఏ ఉమెన్' నుండి 'అప్లాజ్', 'బ్లాక్ పాంథర్ వకాండ ఫరేవర్' నుండి 'లిఫ్ట్ మి అప్' వంటి పాటలతో 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు' పోటీ పడుతోంది.

రజనీ చిత్రంలో జీవిత



సీనియర్ కథానాయిక జీవిత మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ సినిమాల్లో నటించనుంది. సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమాలో ఓ కీలకపాత్రలో నటించనుంది. రజినీకాంత్ ప్రస్తుతం జైలర్‌తో పాటు కూతురు ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న లాల్‌సలాం సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో రజనీ పూర్తి స్థాయి పాత్రలో కాకుండా నిడివి తక్కువగా ఉన్న పాత్రలో కనిపించనున్నాడు. ఈ సినిమాలో రజనీకి చెల్లెలిగా జీవిత కనిపించనుంది. విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనుంది. లైకా సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఏ.ఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చుతున్నాడు.

'అన్నీ మంచి శకునములే'లో గౌతమి లుక్



నందినీ రెడ్డి దర్శకత్వంలో హీరో సంతోష్ శోభన్ నటిస్తున్న రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'అన్నీ మంచి శకునములే'. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో అలనాటి తార గౌతమి కీలక పాత్రలో నటిస్తోంది. మీనాక్షి పాత్రలో కనిపించనుండగా.. ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. పోస్టర్‌లో హోమ్లీ లుక్‌లో కనిపించింది. సమ్మర్ కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. నటులు రాజేంద్రప్రసాద్, నరేశ్, రావు రమేశ్, వెన్నెల కిశోర్, అర్జుణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

అభిమాని కోసం టీజర్ వాయిదా

హీరో సాయిధరమ్ తేజ్ మరోసారి ఔన్నత్యాన్ని చాటుకున్నాడు. తన అభిమాని మరణించాడని తెలిసి ఏకంగా టీజర్ లాంచ్‌ను వాయిదా వేశాడు. బుధవారం తన కొత్త సినిమా 'విరూపాక్ష' టీజర్‌ను రిలీజ్ చేయాలని ఎప్పుడో ప్లాన్ చేసుకున్నాడు. హఠాత్తుగా తన అభిమాని మరణించడంతో టీజర్ రిలీజ్‌ను వాయిదా వేశాడు. మెగా అభిమాని, సాయిధరమ్ తేజ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ అయిన రావురి పండు(28) గుండెపోటుతో మరణించాడు. క్రికెట్ ఆడుతుండగా హర్ట్ స్ట్రోక్ వచ్చినట్లు తెలుస్తుంది. సాయిధరమ్ తేజ్ కోసం పండు ఎన్నో సేవా కార్యక్రమాలు కూడా చేశాడు. అలాంటి అభిమానిని కోల్పోయినందుకు సాయిధరమ్ తేజ్ తీవ్ర విచారం చేశాడు. ఇలా తన అభిమాని మరణించిన రోజున టీజర్‌ను రిలీజ్ చేయడం భావ్యం కాదని విడుదలను పోస్ట్‌పోన్ చేశాడు.

అశ్విన్‌కు అగ్రస్థానం

ఐసిసి టెస్ట్ బౌలర్ల జాబితా విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) బుధవారం విడుదల చేసిన టెస్ట్ బౌలర్ల జాబితాలో రవిచంద్రన్ అశ్విన్ సత్తా చాటాడు. తాజా ర్యాంకింగ్స్‌లో అశ్విన్(864పాయింట్లు) అగ్రస్థానానికి ఎగబాకాడు. దీంతో అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ ఆండర్సన్(859పాయింట్లు)ను వెనక్కి నెట్టి అశ్విన్ టాప్ ర్యాంక్‌కు చేరాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన రెండోటెస్ట్‌లో అశ్విన్ ఆరు వికెట్లతో రాణించడంతో అతని ర్యాంక్ మెరుగైంది. మరోవైపు ఇంగ్లండ్ జట్టు వెల్లింగ్టన్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో అనూహ్యంగా ఓటమిపాలవ్వడంతో ఆండర్సన్ టాప్ ర్యాంక్ చేజారి రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. మూడోస్థానంలో పాట్ కమ్మిన్స్ ఉండగా.. జడేజా 8వ స్థానంలో నిలిచాడు.

యశస్వి రికార్డు డబుల్ సెంచరీ

ఆరంగేట్రం ఇరానీట్రోఫీలోనే డబుల్ సెంచరీ

గ్వాలియర్: యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ అరంగేట్రం ఇరానీట్రోఫీలోనే డబుల్ సెంచరీతో కదం తొక్కి రికార్డు నెలకొల్పాడు. రెస్టాఫ్ ఇండియా తరపున బరిలోకి దిగిన యశస్వి(213).. రంజీట్రోఫీ ఛాంపియన్ మధ్యప్రదేశ్‌పై తొలిరోజు అద్భుత ఆటను ప్రదర్శించాడు. దీంతో రెస్టాఫ్ ఇండియా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 381 పరుగులు చేసింది.

విభిన్న ప్రతిభావంతుల భారత క్రికెట్ జట్టులో తూ.గో వాసి

అంతర్జాతీయ వీల్‌ఛైర్ 20ట్వంటీ క్రికెట్ టోర్నీకి ప్రవీణ్ ఎంపిక



ప్రజాశక్తి- ధవళేశ్వరం(తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతులు మానుపాటి ప్రవీణ్‌కుమార్ భారత క్రికెట్ జట్టులో చోటు సంపాదించారు. ఈ నెల 9 నుంచి 11 వరకు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో ఇండియా, బంగ్లాదేశ్ మధ్య జరిగే వీల్‌ఛైర్ 20ట్వంటీ క్రికెట్ టోర్నీలో భారత జట్టుకు ప్రవీణ్ ప్రాతినిథ్యం వహించనున్నారు. ఈ మేరకు డిసిసిబిఐ (దివ్యాంగ్ క్రికెట్ కంట్రోల్‌బోర్డు ఆఫ్ ఇండియా) 15మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఆ జట్టులో ప్రవీణ్‌కు చోటు దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రవీణ్‌కుమార్ ఒక్కడే భారతజట్టుకు ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం రాజమహేంద్రవరం రూరల్ కాతేరు పంచాయతీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో భోపాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని రాణించారు. ఇండియా తరపున ఆడే అవకాశం రావడం పట్ల ప్రవీణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తనకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ను పలువురు అభినందించారు.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68